# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 29-12-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 132 పేజీలు: 4 వెల: రూ.1/-


### చెక్‌పాయింట్ వద్ద పేలుడు

## 76 మంది మృతి

హైదరాబాద్,^సెంబర్28: సోమాలియా రాజధాని మొగధీషులో ఇవాళ ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఆ ఘటనలో 76 మంది మృతి చెందారు. నగరానికి చెందిన ఓ చెక్ పాయింట్ వద్ద ఉన్న కలెక్షన్ సెంటర్ సమీపంలో ఈ శక్తివంతమైన పేలుడు జరిగింది. ఈ ఘటన పట్ల ఇప్పటి వరకు ఏ ఉగ్ర సంస్థ ఎటువంటి ప్రకటన చేయలేదు. సోమాలియాలో సాధారణంగా ఆల్‌ఖయిదా అనుబంధ సంస్థ అల్ షబాబ్ తరుచూ ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేస్తూనే ఉంటుంది. పేలుడు జరిగిన ప్రదేశం నుంచి సుమారు 76 మంది మృతదేహాలను వెలికితీసినట్లు ఆమిన్ అంబులెన్స్ డైరక్టర్ అబ్దుల్‌కాదిర్ అదన్ తెలిపారు. ఇంకా పదుల సంఖ్యలో జనం గాయపడ్డారు. మృతిచెందినవారిలో విద్యార్థులు, పోలీసు ఆఫీసర్లు ఉన్నారు.

# గాంధీ భవన్ వద్ద టెన్షన్.. టెన్షన్

**కాంగ్రెస్ 'తిరంగ ర్యాలీ'కి అనుమతి నిరాకరణ**
**ర్యాలీకి తీసేందుకు యత్నించిన కాంగ్రెస్ నేతలు**
**భారీగా తరలివచ్చిన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు**
**అడ్డుకొని.. అరెస్టులు చేసిన పోలీసులు**
**గాంధీభవన్‌లో 24గంటల సత్యాగ్రహ దీక్షకు దిగిన కాంగ్రెస్ నేతలు**
**ర్యాలీని ఎట్టిపరిస్థితుల్లో తీసితీరుతాం - ఉత్తమ్**

హైదరాబాద్, డిసెంబర్28 (ఆర్ఎన్ఎ): గాంధీభవన్ వద్ద టెన్షన్ వాతావరణ నెలకొంది. పోలీసుల, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. దీంతో పలువురిని కాంగ్రెస్ నేతలను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీఉకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం 'తిరంగ ర్యాలీ' చేపట్టేందుకు నాయకులు ప్రయత్నించారు. గాంధీ భవన్ వద్ద టీపీసీసీ చీఫ్ ఉత్తమ్, భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ, వి.హెచ్లతో పాటు తదితర నేతలు భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించేందుకు యత్నించారు. దీంతో ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. గాంధీభవన్ నుంచి బయటకు రాకుండా పోలీసులు పహారా కాయడంతో వారి తీరుపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తిరంగ ర్యాలీ చేసి తీరతామని నేతలు స్పష్టం చేశారు. ర్యాలీని బలవంతంగా అడ్డుకోవటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు గాంధీ భవన్‌లోనే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. మరోవైపు డీసీఎంలలో వస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందు గాంధీ భవన్ ముందు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. వీరిలో ముఖ్య నాయకులు కుంతియా, భట్టి, షబ్బీర్ అలీ, శ్రీధర్ బాబు, పొన్నం తదితరులు ఉన్నారు.

### బీజేపీ, టీఆర్ఎస్ రెండూ ఒక్కటే - ఉత్తమ్

కసీఆర్ పాలనలో అన్ని వర్గాల వారు నష్టపోయారని పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీజేపీ, టీఆర్ఎస్ రెండూ ఒక్కటేనన్నారు. 24 గంటల సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలచుకుంటామన్నారు. ఆర్ఎస్ఎస్ సభలకు అనుమతిచ్చిన కేసీఆర్.. సెక్యూలర్ కాంగ్రెస్ ర్యాలీకి అనుమతించలేదన్నారు. బీజేపీ మతపరమైన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. స్వాతంత్ర్యంలో కాంగ్రెస్ ది కీలక పాత్ర అని తెలిపారు. అప్పట్లో బీజేపీ, సంఘ్ పరివార్ ఎవరు పాల్గొనలేదన్నారు. ఎన్ వి ఆర్ లిస్టులో ఉన్న ప్రశ్నలు అభ్యంతకరమన్నారు. అస్సాంలో ఇలాగే చేసి అభాసు పాలయ్యారన్నారు.

పార్లమెంట్ లో ప్రజా సమస్యలపై చర్చకు రాకుండా ఆర్టికల్ 370, ట్రిపుల్ తాలాక్, సీఏఏ, ఎన్ఆర్సి పేరుతో బీజేపీ పక్కదారి పట్టిస్తుందని ఉత్తమ్ అన్నారు. మోడీ ప్రభుత్వం హయంలో టూరిజం తగ్గిందన్నారు. జీడీపీ పడిపోయి దేశ అభివృద్ధి వెనక్కి వెళ్లిందన్నారు. దేశంలో మోడీని రాష్ట్రంలో కేసీఆర్ ని గద్దె దించేయాలనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. హైదరాబాద్ కమిషనర్ అంజనీ కుమార్ కేసీఆర్‌కు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

### కేసీఆర్‌కు కాంగ్రెస్ భయం పట్టుకుంది - భట్టి విక్రమార్క

కేసీఆర్‌కు కాంగ్రెస్ భయం పట్టుకుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. శాంతియుతంగా తాము నిర్వహించాలనుకున్న ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని అన్నారు. తాము ర్యాలీ నిర్వహించే మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని పోలీసుల నుంచి తమకు లేఖ వచ్చిందని... ర్యాలీ ఎక్కడ చేయాలో మీరే చెప్పాలని, మీరు చెప్పిన మార్గంలోనే ర్యాలీ చేస్తామని పోలీసులకు తాము మరో లేఖ రాశామని చెప్పారు. అయితే, తమ లేఖకు పోలీసుల నుంచి ఇంత వరకు సమాధానం రాలేదని అన్నారు. తాము ర్యాలీని వాయిదా వేసుకోలేదని... ర్యాలీని నిర్వహించి తీరుతామని చెప్పారు. తమ వ్యూహాలు తమకు ఉన్నాయని తెలిపారు. బీజేపీ కవాతుకు, ఎంఐఎం సభకు అనుమతిచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం తమ ర్యాలీని అడ్డుకోవాలనుకోవడం సరికాదని భట్టి విక్రమార్క అన్నారు. టీఆర్ఎస్, ఎంఐఎం రెండు పార్టీలూ బీజేపీకి మద్దతు పలుకుతున్నాయని చెప్పారు. కేసీఆర్ వైఖరిని ప్రజలకు వివరిస్తామని అన్నారు. కేసీఆర్ కు కాంగ్రెస్ భయం పట్టుకుందని... అందుకే తమను అడ్డుకుంటున్నారని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ ఈ ర్యాలీని వాయిదా వేసుకోబోదని, ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించి తీరతామని భట్టి స్పష్టం చేశారు.

### ఆర్ఎస్ఎస్, ఎంఐఎం ర్యాలీలకు ఎలా అనుమతిచ్చారు - వీహెచ్

ఆర్ఎస్ఎస్, ఎంఐఎం ర్యాలీలకు అనుమతిచ్చినప్పుడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టే ర్యాలీకి ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు అన్నారు. హైదరాబాద్ లో ఆర్ఎస్ ఎస్ ర్యాలీ, నిజామాబాద్ లో ఎంఐఎం ర్యాలీలకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్షతోనే తిరంగా ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని అన్నారు. డీజీపీని అడ్డుపెట్టుకుని పర్మీషన్ ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. డీజీపీని అడ్డుపెట్టుకుని కేసీఆర్ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతల సమస్య అయితే నిజామాబాద్‌లో మజ్లిస్ సభ, హైదరాబాద్‌లో ఆర్ఎస్ఎస్ ర్యాలీకి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం జరిగిన ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ ర్యాలీకి అనుమతి ఇచ్చి, రోడ్డు పై నడిచేందుకు..రెండు పక్కల పబ్లిక్ ను ఆపి.. ర్యాలీకి సహకరించారని తెలిపారు. ఎల్ బీ నగర్ నుంచి సరూర్ నగర్ వరకు ఆర్ఎస్ఎస్ కార్యర్తలు కట్టెలు పట్టుకుని ర్యాలీ తీశారని...వారికి ఎలా పర్మీషన్ ఇచ్చారని వీహెచ్ నిలదీశారు. నిజామాబాద్ లో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి మజ్లిస్ సభకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. పబ్లిక్ మీటింగ్ పెట్టాలో, ర్యాలీలో తీయాలో చెప్పేందుకు పోలీసులు ఎవరని ప్రశ్నించారు. తాము ఏమేమి కార్యక్రమాలు చేయాలో పోలీసులు ఎలా ఆదేశిస్తారని మండిపడ్డారు. మీటింగ్ లే పెట్టాలి, ర్యాలీలు తీయొద్దని పోలీసులు చెప్పడం సరికాదన్నారు. అలా అయితే ఆర్ఎస్ఎస్, ఎంఐఎంలకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. సెక్యులర్ దేశంలో కొత్త నవరణ బిల్లు తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు.

## తెలంగాణలో పెరిగిన అవినీతి కేసులు

**- అత్యధికంగా రెవెన్యూశాఖలోనే**
**- వార్షిక నివేదికను విడుదల చేసిన ఏసీబీ**

హైదరాబాద్, డిసెంబర్28(ఆర్ఎన్ఎ): తెలంగాణలో అవినీతి కేసులు పెరిగాయి. 2018తో పోలిస్తే రాష్ట్రంలో అవినీతి కేసుల సంఖ్య పెరిగింది. 2019 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోదక శాఖ అధికారులు విడుదల చేశారు. తెలంగాణలో ఈ ఏడాది 173 ఏసీబీ కేసులు నమోదు అయ్యాయి. 2018లో వ్యాప్తంగా 139 అవినీతి కేసులను ఏసీబీ నమోదు చేయగా.. 2019లో ఈ సంఖ్య 173కు చేరింది. అత్యధికంగా రెవెన్యూ శాఖలో 54 కేసులు నమోదు చేశారు. హోంశాఖలో 18, మున్సిపల్ శాఖలో 25, పంచాయతీరాజ్ శాఖలో 10, విద్యుత్ శాఖకు చెందిన 12 మంది ఉద్యోగులపై కేసులు నమోదు అయ్యాయి. హెల్త్ అండ్ మెడికల్ డిపార్ట్ మెంట్ లో 13, న్యాయశాఖలో 5, ఇరిగేషన్ శాఖలో 3, విద్యాశాఖలో 4, రోడ్డు రవాణా శాఖలో 3 కేసులను ఏసీబీ నమోదు చేసింది. 2019లో నమోదైన ఏసీబీ కేసుల సంఖ్యను పరిశీలిస్తే రెవెన్యూ శాఖలో అత్యధికంగా 54 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది రెవె న్యూ శాఖలో 37 అవినీతి కేసులు నమోదైతే.. ఈ ఏడాది అత్యధికంగా 54 కేసులు నమోదయ్యాయి. అవినీతి కేసుల్లో రెవెన్యూ శాఖ మొదటి స్థానంలో ఉండగా 25 కేసులతో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ శాఖ రెండో స్థానంలో నిలిచింది.

## పౌరచట్టానికి మద్దతుగా భారీ ప్రచారం

హైదరాబాద్: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ చట్టంపై అవగాహన కల్పించేందుకు బీజేపీ భారీ ప్రచారం నిర్వహించనున్నది. జనవరి 5 నుంచి 15వ తేదీ వరకు ఆ చట్టంపై విస్తృత ప్రచారం కల్పించనున్నారు. ఆర్ఎస్ఎస్ కూడా ఈ ప్రచారంలో పాల్గొంటుందని భావిస్తున్నారు. బౌద్దులు, దళితులు, మైనార్టీలకు ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు బీజేపీ ప్రణాళికలు వేస్తున్నది. కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు జేపీ నడ్డా, ఇతర మంత్రులు దేశవ్యాప్త ప్రచారంలో పాల్గొంటారు.

# ప్రపంచాన్ని మార్చే శక్తిగల ఆయుధం విద్య




*తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ టస్మా ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో - 2019 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు*

**- పిల్లలకు విలువలతో కూడిన విద్య అవసరం**
**- విద్య అంటే ర్యాంకులు, మార్కులుగా భావించొద్దు**
**- తెలంగాణ ఉద్యమంలో ట్రస్మా సహకారం అయోఘం**
**- ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు**

హైదరాబాద్, డిసెంబర్28(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని మార్చే శక్తిగల ఆయుధం విద్య అని, నేటి తరం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, విలువలు కలిగిన విద్యను బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం టస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో ఎడ్యుకేషన్ ఎక్స్‌పో - 2019 జరిగింది. కార్యక్రమాన్ని హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... టస్మా ఇలాంటి ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయం. తెలంగాణ ఉద్యమం లో ట్రస్మా సహకారం గొప్పదని, తెలంగాణ రాష్ట్రం ఎంత అవసరమో ఉద్యమం సమయంలో ట్రస్మా చాటిచెప్పిందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు విద్యుత్ బిల్లులు, మున్సిపల్ టాక్స్ తగ్గింపు, శిక్షణ కేంద్రానికి స్థలం కోరారు. సీఎం కేసీఆర్ కు ఈ సమస్యలు విన్నవిస్తానని అన్నారు. 29లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూల్స్ చదివితే, 33 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్స్ లో చదువుతున్నారని, పిల్లలకు విద్యతో పాటు నాలుగు లక్షల మందికి ప్రైవేటు స్కూల్స్ ఉపాధినిస్తున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు రావాలని, పిల్లలకు నాణ్యమైన విద్య ఎంత అవసరమో విలువలతో కూడిన విద్య అంతే అవసరమని హరీష్‌రావు స్పష్టం చేశారు. ప్రపంచాన్ని మార్చే శక్తి గల ఆయుధం విద్య అన్నారు. విద్య అంటే ర్యాంకులు, మార్కులుగా భావించవద్దని అన్నారు. విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు, ప్లాస్టిక్ రహిత సమాజం పట్ల అవగాహన, మొక్కల పెంపకం, సమయ పాలన నేర్పాలన్నారు. దేశానికి శక్తి గల సమాజాన్ని అందించగలిగేది విద్యాలయాలేనని, పాశ్చాత్య సంస్కృతి విస్తరిస్తున్న ఈ సమయంలో మన దేశ సంస్కృతి గొప్పతనం తెలియజేయాలన్నారు. సోషల్ మీడియాకు పిల్లలను బానిసలు కాకుండా చూడాలని, మార్కులు రాకపోతే జీవితం కోల్పోయినట్లే అన్న భావన పిల్లల్లోరానివ్వద్దన్నారు. విపత్కర పరిస్థితులను తట్టుకునేలా పిల్లలను తీర్చిదిద్దండని హరీష్‌రావు సూచించారు. ప్రైవేటు స్కూల్స్ అన్నీ ప్లాస్టిక్ రహిత విద్యాలయాలుగా మార్చాలని కోరుతున్నానని మంత్రి పేర్కొన్నారు.

# ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి: రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ సూచన



నిజామాబాద్, డిసెంబర్ 28:: తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజల పట్ల రెవెన్యూ అధికారులు, సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. ఈ రోజు కలెక్టర్ నవీపేటలో పర్యటించి ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. మొదట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన ఆయన అక్కడ ఇద్దరు డాక్టర్లు కూడా లేకపోవడం, ఆ సమయంలో విధుల్లో ఉండవలసిన డాక్టర్ తరుణ్ రాజ్ గైర్హాజరు కావడం, హెడ్ నర్స్ ఝాన్సీ వాణి కలెక్టర్ తనిఖీ చేస్తున్న సమయంలో ఆలస్యంగా రావడం, మిగితా సిబ్బంది రజనీ దేవి, నారాయణ, మంజుల, సరళ లేకపోవడం కుమారి అనే ఉద్యోగి సెలవు దరఖాస్తులో తేదీలు రాయకపోవడం, హాజరు రిజిస్టర్ లో కలెక్టర్ గమనించారు. అప్పటికప్పుడు కలెక్టర్ హాజరు రిజిస్టరు జిరాక్స్ తెప్పించుకున్నారు. ఆస్పత్రి అన్ని విభాగాలు పరిశీలించిన ఆయన పేషెంట్లు లేకపోవడం గురించి హెడ్ నర్సును ప్రశ్నించారు.

ఇంత మంచి ఫర్నిచర్ ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఉండదని కానీ ఇక్కడ పేషెంట్లు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్.. డాక్టర్లు సరిగా విధులలో ఉంటే పేషెంట్లు ఉండరా..! అని నిలదీశారు. జిల్లా వైద్యాధికారి సుదర్శన్ కు ఫోన్ చేసి ఆస్పత్రి పరిస్థితిని వివరించి, జిల్లా అంతటా ఇదే విధంగా ఉన్నదా అని అడిగారు. ఆసుపత్రి వాతావరణం ఏ మాత్రం బాగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పర్యటించిన కలెక్టర్.. విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీరు ఎంత దూరం నుంచి పాఠశాలకు వస్తున్నారు. ఎలా వస్తున్నారని అడిగి తెలుసుకున్నాడు. విద్యార్థుల తల్లిదండ్రుల ఏం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చాలామంది విద్యార్థులు.. తాము పేద కుటుంబం నుంచి వచ్చామనీ.. తమ తండ్రి వ్యవసాయం చేస్తున్నట్లు కొంతమంది, దుబాయ్ వెళ్లినట్లు మరికొంది చెప్పగా, కొంతమంది విద్యార్థులు తండ్రి లేనట్లు చెప్పారు. తల్లులు వ్యవసాయం లేదా బీడీలు చేస్తున్నట్లు చెప్పారు ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదనీ.. కష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని సూచించారు. కష్టపడితే దేనినైనా సాధించవచ్చని తెలిపిన ఆయన చిన్నచిన్న ఇబ్బందులను దాటుకుంటూ పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు.

పదో తరగతిలో 10/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థులకు పదివేల నగదు పురస్కారం అందిస్తానని కలెక్టర్ విద్యార్థలలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటస్థలం లేదని కలెక్టర్ కు విన్నవించగా పక్కనే ఉన్న గోదాము స్థలాన్ని క్రీడలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవోను ఆదేశించారు పాఠశాల బాత్ రూమ్ లకు డోర్లు ఏర్పాటు చేయాలనీ, పంచాయతీ రాజ్ సహ ఇంజనీర్ ను ఆదేశించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్.. తాసిల్దార్ తో సమావేశమై ధరణిలో ఎన్ని పెండింగ్ లు ఉన్నాయని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది తో మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతుల సమస్యలు పరిష్కరించాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. మీ పరిధిలో వీలైతే సమస్య పరిష్కరించాలని లేదంటే ఏ విధంగా పరిష్కారం అవుతుందో సూచించాలని వారిని కలెక్టర్ ఆదేశించారు. అంతేగాని వచ్చే పేద ప్రజలను భయపెట్టి పంపించవద్దని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం ఎంతవరకు వీలైతే అంతవరకు చేయాలన్నారు. ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సమయపాలనతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. మొదటిసారిగా నవీపేట మండలానికి వచ్చినందున తహసీల్దార్, ఎంపీడీవోలపై నమ్మకంతో వెళ్తున్నానని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కలెక్టర్.. ఆరోగ్యం, విద్యపై నూటికి నూరు శాతం దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందనీ.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే పల్లె ప్రగతి కార్యక్రమాల్లో నిర్దేశించుకున్న అన్ని పనులు పూర్తి చేయడానికి కృషి చేయనున్నామనీ, గ్రామాలకు ట్రాక్టర్లు సమకూర్చడంతో పాటు స్మశాన వాటికలు, వైకుంఠ ధామాలు పూర్తి చేసుకునేలా నిధులు మంజూరు చేశామన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో వేరే మొక్కలు నాటడంతో పాటు అన్ని మొక్కలను సంరక్షించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసి ఆ గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ధరణి కార్యక్రమంలో 2200 సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని వాటిని పరిష్కరించవలసిందిగా ఆదేశించామన్నారు. ఈ సందర్భంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ లత, ఎంపీడీవో సాధిక్ అలీ, పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

# సామాన్యుడు మంత్రికి ఎలా తెలుస్తాడు?

**- ట్విటర్‌లో ప్రశాంత్ కిశోర్**

న్యూఢిల్లీ, డిసెంబర్28(ఆర్ఎన్ఎ): సామాన్యుడు సీనియర్ మంత్రికి ఎలా తెలుస్తాడు అంటూ.. కేంద్ర మంత్రిపై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ శనివారం ట్వీట్ చేశారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి హర్దీప్ సింగ్ పురీ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశాంత్ కిశోర్ ఎవరో తనకు తెలియదని చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం ప్రశాంత్ కిశోర్ సేవలను ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఉపయోగించుకోనున్న విషయాన్ని విలేకరులు ప్రస్తావించినపుడు మంత్రి మాట్లాడుతూ, ప్రశాంత్ కిశోర్ తనకు వ్యక్తిగతంగా తెలియదని, ఇంతకీ ఆయన ఎవరని అన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ ప్రచార కార్యక్రమంలో ప్రశాంత్ కిశోర్ కూడా భాగస్వామి అన్న విషయాన్ని విలేకరులు గుర్తు చేయగా ఆ ఎన్నికల సమయంలో తాను అక్కడ లేనని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రశాంత్ కిశోర్ ఎన్‌డిఏ మిత్రపక్షమైన జెడియు ఉపాధ్యక్షుడు కూడా అన్న విషయాన్ని తెలియచేసినపుడు.. ఏమో తెలిసి ఉండవచ్చు కాని ఆయనెవరో తనకు వ్యక్తిగతంగా తెలియదంటూ మంత్రి వ్యాఖ్యానించారు. దీనిపై ప్రశాంత్ కిశోర్ శనివారం ట్విట్టర్ ద్వారా ఘాటుగా స్పందించారు. తనలాంటి సామాన్యుడు సీనియర్ మంత్రికి ఎలా తెలుస్తారని కిశోర్ వ్యాఖ్యానించారు. ఆయనో(పురి) సీనియర్ మంత్రి, నాలాంటి సామాన్యుడు ఆయనకు ఎలా తెలుస్తాడని సెటైర్లు వేశారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌కు చెందిన నాలాంటి లక్షలాది మంది ఢిల్లీలో బతుకు పోరాటం సాగిస్తున్నారని, సీనియర్ నాయకుడైన పురి లాంటి వారికి మా గురించి ఎలా తెలు స్తుంది అంటూ ప్రశాంత్ కిశోర్ ఎద్దేవా చేశారు.

## కౌన్సిలర్ టికెట్లలో నేను జోక్యం చేసుకోను

**- నాభార్యకు కూడా నేను టిక్కెట్ ఇవ్వను**
**- సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి**

సంగారెడ్డి, డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి): త్వరలో జరగబోయే పురపాలక ఎన్నికల్లో టికెట్ల విషయంలో తాను జోక్యం చేసుకోనని, కనీసం నా భార్యకు కూడా నేను టికెట్ ఇవ్వనని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్ టిక్కెట్ల విషయంలో తాను జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు. ఎన్నికల ఇంచార్జీ, ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు కలిసి అభ్యర్థిని ఎంపిక చేయాలన్నారు. టీఆర్ఎస్ వాళ్లు చేసే ఖర్చు కన్నా ఎక్కువ డబ్బులు మనం ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## ప్రముఖ టీవీ యాంకర్ భర్త ఆత్మహత్య!

**- అక్రమ సంబంధమే కారణమా?**

చెన్నై, డిసెంబర్28(ఆర్ఎన్ఎ): ప్రముఖ బుల్లితెర నటి, టీవీ వ్యాఖ్యాత భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమిళనాడులోని పెరంబూరు ప్రాంతంలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పెరంబూరు, నటరాజన్ కోవిల్ వీధికి చెందిన గోపీనాథ్ (39) స్థానిక అన్నానగర్, టీవీఎస్ కాలనీలోని ఓ ప్రైవేట్ ప్రచార సంస్థలో కార్యనిర్వాహకుడిగా పనిచేస్తున్నాడు. అతని భార్య రేఖ బుల్లితెర నటిగా, వ్యాఖ్యాతగా రాణిస్తోంది. పదేళ్ల క్రితం వీరు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం.

ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం గోపీనాథ్ జేజే నగర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. అయితే అక్కడ అదే సంస్థలో పని చేస్తున్న ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలిసింది. దీనిపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదే విషయమై గత బుధవారం కూడా వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో బుధవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కార్యాలయానికి సెలవు అయినా గోపీనాథ్ ఆఫీస్‌కు వచ్చాడు. కార్యాలయంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరుసటి రోజు గురువారం ఉద్యోగులు వచ్చి చూడగా.. గోపీనాథ్ ఉరేసుకుని ఉండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జేజే నగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కీల్‌పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కాగా, భార్య రేఖతో గొడవ కారణంగానే గోపీనాథ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. అలాగే ఆయనకు అప్పుల బాధ కూడా ఉన్నట్లు తెలిసింది.

## చరిత్రలో నేటినిజం



కం!! మోజు లూరి ఫోజులతో
బ్రొజిష్టైడి లోతిగ తెరపై నటియింపన
"రాజేష్ ఖన్నా" సతతమే
రాజిల్లును మనమలందు రసికాత్మునిగనే!!

(డిసెంబర్ 29 రాజేష్ ఖన్నా జయంతి..)



-రాధశ్రీ
సెల్: 9494481210

# టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మేడ్చల్, డిసెంబర్ 28: నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన టీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. 'తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా మున్సిపాలిటీలకు నిధులిచ్చాం. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు 24 గంటల కరెంట్ గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లు మన నగరం కార్యక్రమంతో అద్దంలా తయారయ్యాయి. టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించి సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు కానుకగా ఇద్దామని' మంత్రి పిలుపునిచ్చారు.

# ఇదే ఆందోళన పడాల్సిన విషయం...!!

నేటినిజం
ఆదివారం 29-12-2019

ఆహార ధాన్యాలు, ఇంకా ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ద్రవ్యోల్బణ తీవ్రత అధికమవుతోంది. నిత్యావసరాల ధరలకు సామాన్యుడు కొనలేక సతమతమవుతున్నాడు. ఒకప్పుడు రూపాయికి ఒక డాలరు లభించిన రోజులు, డాలరు విలువ 62 రూపాయలకు మించిపోయింది. రూపాయి కొనుగోలు శక్తి క్రమంగా క్షీణిస్తోంది. అవసరమైన ఆహారధాన్యాలను , నిత్యావసర వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకుని స్వయంసమృద్ధితో ఆర్థిక స్వావలంబన చేసుకునే దిశగా కృషి అవసరమన్నారు గాంధీజీ. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా, ఈ ఆలోచనలకు పొంతన లేకుండా విదేశీ వస్తువుల పట్ల మోజు నానాటికీ అధికమవుతోంది. సరళీకృత ఆర్థిక విధానంలో చైనా బియ్యం నుంచి ఆఫ్రికా బంగారం వరకు దిగుమతులు ఎక్కువైపోతున్నాయి. సుంకం పెంచడం ద్వారా బంగారం దిగుమతులను కొంత వరకు నియంత్రించారు. ఇతర దిగుమతులు కొనసాగుతూనే ఉన్నాయి. విదేశీ వ్యాపార లోటు కంటే మనదేశ వ్యాపార లోటు చాలా తక్కువగా ఉంది. ఇదే ఆందోళన పడాల్సిన విషయం. రూపాయి పతనానికి వ్యవసాయం సమస్యల వలయంలో చిక్కుకోవడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. 2008–2009 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం మనదేశ ఆర్థిక వ్యవస్థపైన పడింది. ఇందుకు రిజర్వుబ్యాంకును అనుసరిస్తున్న ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ వ్యాపార విధానాలు కారణాలు కావచ్చు. ప్రపంచ వ్యాపార సంస్థ లో సభ్యత్వం గల దేశం మనది. అందు వల్ల కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉండటం వలన్ల మనదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల కార్యకలాపాలు ప్రభావితం అవుతున్నాయి. దేశంలో లభ్యమయ్యే ఖనిజ సంపదను వినియోగించుకోకుండా దిగుమతులపై ఆధారపడి విదేశీ మారక ద్రవ్యాన్ని పెద్దమొత్తంలో వ్యయీకరించడమూ ప్రస్తుత సంక్షోభానికి కారణం అవుతోంది. దేశంలో 60 శాతం జనాభాకు ఉపాధి అందిస్తున్న వ్యవసాయ రంగానికి తగినంత ప్రాధాన్యత లభించకపోవడం ఈ సంక్షోభానికి ముఖ్యకారణం. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుముఖం పడతాయి. తగ్గితే ధరలు తగ్గుతాయి. అందుకే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు ప్రభుత్వం కేటాయింపులు పెంచాలి. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. వాణిజ్య పంటల ధరలు ఎక్కువగా ఉంటుండటంతో రైతులు ఆ పంటలపై మొగ్గుచూపుతున్నారు. కనుక కనీస మద్దతు ధర అన్ని పంటలకు నిర్ణయించాలని ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకోవాలి. రైతుకు గిట్టుబాటు ధర లభింపజేయడం అత్యంత ముఖ్యమైనది. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా ఉండాలన్న స్వామినాధన్ సిఫార్సును నిత్యం గౌరవించాలి. దేశాన్ని సంక్షోభం నుంచి కాపాడటానికి ఒకవైపు ప్రజలు, ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. స్వదేశీ వస్తువుల వినియోగం ఎంత అవసరమో? ఎందుకు అవసరమో అనే విషయాన్ని గాంధీ సూచించిన మార్గాలను అనుసరించాలి..!!

## టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎంఐఎం నడిపిస్తుంది

**– కేసీఆర్ పెద్దకొడుకుగా ఓవైసీ మారాడు**

**– సీఏఏ, ఎన్‌పీఆర్‌లపై వ్యతిరేకత ఎందుకు?**

**– బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్**

కరీంనగర్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి): సీఏఏ, ఎన్‌పీఆర్‌లపై వ్యతిరేకత ఎందుకో కాంగ్రెస్, టీఆర్ఎస్, ఎంఐఎం, వామపక్షాలు సమాధానం చెప్పాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓవైసీ పూర్వీకుల గురించి బయటపడుతుందనే ఎన్ఆర్‌సీని వ్యతిరేకిస్తున్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీపై కేంద్రం వెనక్కి తగ్గేదిలేదు. ఖరాఖండీగా అమలవుతుంది. మున్సిపల్ ఎన్నికల్ దృష్టిలో పెట్టుకొనే ఓవైసీ సభ పెట్టాడు. జాతీయగీతం పాడని ఓవైసీ సెక్యులరిజం గురించి మాట్లాడుతున్నాడు. హిందువులకు వ్యతిరేకం కాదంటూ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ కంటితుడుపు ప్రకటనలు చేస్తున్నారన్నారు. దేశంలో 15నిమిషాలు పోలీసులు తప్పుకుంటే.. హిందువులను అంతం చేస్తామన్న వ్యాఖ్యలు హిందువులకు వ్యతిరేకం కాదా.. హిందువుల పట్ల వ్యతిరేకత లేకపోతే అయోధ్య అంశంలో సుప్రీం కోర్టు తీర్పును ఎంఐఎం ఎందుకు తప్పుబట్టిందని ప్రశ్నించారు. లౌకికవాద పార్టీ అంటూ గొప్పగా ప్రకటించుకునే టీఆర్ఎస్ పార్టీ సిఎఎ, ఎన్‌పీఆర్ ను ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వే పేరుతో పౌరుల వ్యక్తిగత వివరాలు సేకరించిన టీఆర్ఎస్ ప్రభుత్వం... ఎన్.పి.ఆర్ ను వ్యతిరేకించడం ద్వంద్వ విధానం కాదా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టి, అలజడి సృష్టించేందుకు కాంగ్రెస్, ఎంఐఎం, టీఆర్ఎస్, వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. భారత్ మాతా కీ జై అనని పార్టీలు కూడా దేశం గురించి మాట్లాడటం విడ్డూరం గా ఉందన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ లో మైనారిటీలపై హింసను ఏనాడూ ప్రశ్నించని ఎంఐఎం... ఆ దేశాల నుంచి భారత్ వచ్చే శరణార్థులకు పౌరసత్వం ఇవ్వడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తోందో సమాధానం చెప్పాలన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఏకమవుతున్నాయని.. ప్రజలంతా ఏకమై బీజేపీకి మద్దతుగా నిలుస్తారని సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## యోగి కఠిన చర్యలతో కంగుతిన్నారు!

**– యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కార్యాలయం**

లఖ్‌నవూ, డిసెంబర్ 28(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ చట్టంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్లే ఆందోళనకారులు వెనక్కి తగ్గారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యాలయం అభిప్రాయపడింది. ఆదిత్యనాథ్ చర్యలతో నిరసనకారులు కంగుతిన్నారని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేవారి నుంచి నష్టపరిహారం వసూలు చేస్తామన్న సీఎం ప్రకటనతో ఆందోళనకారులంతా ఆశ్చర్యానికి గురయ్యారని అభిప్రాయపడింది. ఆందోళనలు సద్దుమణిగినా.. పరిహారం మాత్రం వసూలు చేసి తీరతామని స్పష్టం చేసింది. ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి సవాల్ విసిరి తప్పుచేశామని ఆందోళనకారులు భావిస్తున్నారని పేర్కొంది. యూపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇప్పుడు దేశం మొత్తానికి ఆదర్శంగా మారనున్నాయని వ్యాఖ్యానించింది. సీఏఏకి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల చెలరేగిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. పలుప్రాంతాల్లో నిరసనకారులు పోలీసులపైకి దాడికి దిగారు. వాహనాలకు నిప్పంటించారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో అనేక మంది గాయపడ్డారు. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం విధ్వంసం సృష్టించేవారిపై కఠిన చర్యలుంటాయని ప్రకటించింది. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేసేవారి నుంచి పరిహారం వసూలు చేస్తామని తెలిపింది. ఈ మేరకు దాడుల్లో పాల్గొన్న దాదాపు 498 మందిని ప్రభుత్వం గుర్తించింది. పరిహారం చెల్లించాలంటూ వారందరికీ నోటీసులు పంపింది. ఈ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో పలువురి ఆస్తుల్ని అటాచ్ చేయడం ప్రారంభించామని పోలీసులు ఇటీవల తెలిపారు.

## రాజన్న ఆలయంలో కొనసాగుతున్న రద్దీ

వేములవాడ,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి): మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రాజన్న సన్నిధికి భక్తుల తాకిడి పెరుగుతున్నది. మేడారం వెళ్లే భక్తులు మొదటగా రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితి. ఈ క్రమంలో భక్తులు భారీగా తరలి వచ్చి ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, తలనీలాలు సమర్పించుకుని క్యూలైన్లలో బారులు తీరారు. కోడెమొక్కును చెల్లించుకుంటున్నారు. ప్రత్యేక అభిషేకపూజలు, అన్నపూజలు, కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. గండదీపం, పల్లకీసేవలు, పెద్దసేవలు, కల్యాణ మొ క్కులను చెల్లించుకున్నారు.

## మున్సిపాలిటీల్లో విజయం మాదే: పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి): మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే హవా అని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో తమపార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని అన్నారు. టీఆర్ఎస్ అత్యంత బలమైన పార్టీ అని అన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అత్యధిక మెజార్టీతో విజయాన్ని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు వ్యతిరేక ప్రచారం చేసినప్పటికీ ఎమ్మెల్యే, స్థానిక సంస్థల ఎలక్షన్‌లో పోటీ చేసి కనీసం ఉనికిని కూడా కాపాడుకోలేక పోయాయన్నారు. ఎన్నికలు అంటేనే ప్రతిపక్షాలు వణికిపోతున్నాయన్నారు. పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మున్సిపాలిటీల పరిధిలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నది. మనం చేసిన పనులే ప్రజలకు వివరించాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలాగే ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాలను అనుమతులిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల వారు ప్రయోజనం పొందుతున్నారు. వారి వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న కార్యక్రమాలను వివరిం టచాలనిఅన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి. మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలను టీఆర్ఎస్ కైవసం చేసుకోవాలి. ఈ ఎన్నికలతో టీఆర్ఎస్ సత్తా మరోసారి చాటిచెప్పాలి. అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నకిలీలపై అప్రమత్తత అవసరం

మెదక్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి) వినియోగదారుడు తాము కొనుగోలు చేసే ప్రతి వస్తువును నిశితంగా పరిశీలించి, ప్రతి వస్తువుకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా తూనికలు కొలతల అధికారి భూలక్ష్మిసూచించారు. అప్పుడే నకిలీలపై లేదా ఇతరత్రా అమ్మకాలపై చర్యలు తీసుకునే అవకావం వస్తుందని అన్నారు. వినియోగదారుడు మోసపోయినట్లు గుర్తిస్తే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి నష్టపరిహారం పొందవచ్చునన్నారు. ప్రతి వస్తువు లేదా ఉత్పత్తులకు సంబంధించిన కొనుగోళ్లకు రశీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు రశీదులు ఉంటే మోసాలు జరిగినప్పుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. రశీదులు తీసుకోకుండా వస్తువులను కొనుగోలు చేయడం అంటే మోసపూరిత వ్యాపారాలను ప్రోత్సహించడమేనన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. మానవ సంబంధాలను తమ పిల్లలకు నేర్పించాలన్నారు. వ్యాపారులు నాణ్యత లేని వస్తువులను రశీదులు లేకుండా వినియోగదారులకు అందించి మోసం చేస్తారన్నారు.

# అందరికీ విద్య ఉద్యమంగా సాగాలి

హైదరాబాద్, డిసెంబర్ 28:అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు విద్య అందడం లేదు. ఈ దశలో ఉన్న స్కూళ్లను ఊసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్నారు. మారుమూల ప్రాంతా పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూల్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకులకు తగదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకున్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మదానికి లేదు. జూన్ 12న స్కూళ్లు ప్రారంభమైనా ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. రాష్ట్రంలోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్వం భావిస్తున్నా, మరింత వెనకబడి పోవడం ఖాయం. తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నారు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు, అనుచరగణం తెలుగు మీడియం రద్దుకు సమాధానం చెప్పలేక ఇలా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోగలరని పరిశోధనలురుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలం దరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమం లోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాష లోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. మన దేశంలో అన్ని రాష్ట్రాలూ వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తు న్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్,హిందీభాషలు నేర్పితే సరిపోతుంది.

తెలుగే అర్థం కాక వారి తెగల భాషలో వాలంటీర్లు అనువాదం చేస్తే తప్ప గిరిజన పిల్లలు స్కూలుకు రాని పరిస్థితి వుంది. ఇక ఇంగ్లీషు రుద్దితే బడి మానేస్తారు తప్ప అద్భుతంగా రాణించలేరు. ఇంట్లో తెలుగు, ఊరిలో తెలుగు, సమాజమంతా తెలుగు వినిపిస్తోంది. పుట్టిన దగ్గర నుండి తెలుగు వింటూ, మాట్లాడు తుంటారు. కనుక తెలుగులో క్లిష్టమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోడానికి అవకాశం వుంది. ఒకవేళ తెలియకపోతే ఎవరిని అడిగినా చెప్పగలరు. అదే తెలియని ఇంగ్లీషు భాషలో అర్థం చేసుకోవడం కష్టం. ఇంగ్లీషు తెలియని ఇళ్ళు, సమాజం నుండి వివరణ అడిగి తెలుసుకునే అవకాశం తక్కువ. అందువలన ప్రాథమిక విద్యా స్థాయిలో... ఆంగ్ల మాధ్యమంలో విషయ పరిజ్ఞానం, జ్ఞాన సంపాదన కష్టం. పైగా పేదలు తమ పిల్లలకు డబ్బు పెట్టి ట్యూషన్‌కు పంపించలేరు. టీచర్లను పెట్టి చదివించుకోలేరు. అన్ని విధాలా పేదల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో నష్టపోవడం ఖాయం. డబున్న వాళ్లకు అన్ని అవకాశాలు వుంటాయి గనుక ఏ మాధ్యమమైనా ఫర్వాలేదు. అయినా వారిలో కూడా విషయపరిజ్ఞానం అంతగా ఉండదనే గుర్తించాలి.

భారతీయుడి ఆలోచన బ్రిటీష్ వాడిదిగా ఉండాలనే లక్ష్యంతో మెకాలే విద్యా విధానం ప్రవేశ పెట్టారు. తన ఆలోచనలతో ప్రభావితం చేసి భారతీయులను శాశ్వతంగా బానిస మనస్తత్వంతో బతికేలా కుట్ర చేశారు. ప్రజలంతా ఒక్కటై తనపై తిరగబడకుండా 3 లేక 4 భాషల ప్రజలను ఒక ప్రావిన్స్‌లో ఇరికించారు. ఈ కుట్రను భగం చేసి అందరినీ ఒక్కటి చేసేందుకే మాతృభాషా ఉద్యమాలకు జాతీయోద్యమం పిలుపునిచ్చింది. అందువల్ల ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదం కావాలి.అది దేశంలో జాతీయోద్యమంగా సాగాలి.

# పుస్తకం హస్తభూషణం

### బుక్‌ఫెయిర్‌లో అపూర్వ విజ్ఞానం

హైదరాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): పుస్తకం హస్తభూషణం అన్నారు. ఇంటర్‌నెట్,స్మార్ట్ ఫోర్ మాయలో పడి మనం అంతా పుస్తక పఠనాన్ని మర్చి పోయాం. ప్రతిదీ గూగుల్ చూసి పెడుఉతందన్న భావనలో ఉన్నాం. కానీ పుస్తక పఠనంతోనే మస్తిష్కం వికసిస్తుంది. మనం మరచిపోతున్న ఈ అలవాటును జ్ఞప్తికి చేసుకునేలా పుస్తక ప్రదర్శనలు ఉపయోగపడుతున్నాయు. అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్న బుక్‌ఫెయిర్‌లు మళ్లీ ఆనదదాన్ని నింపుతున్నాయి. ఆసక్తిని పంచుతున్నాయి. హైదరాబాద్‌లో ఆరంభమయిన బుక్ ఫెయిర్ గురించి పుస్తకాభిమానులు, పఠనాభినివేశాన్ని నిరంతరం కొనసాగిస్తున్న నూతన తరాల ప్రతినిధులు ఒక గొప్ప అనుభూతిగా చెబుతున్నారు. బుక్ ఫెయిర్ మిగిల్చిన విజ్ఞాన రుచులను మననం చేసుకుంటూ మరిన్ని పుస్తకాలు చదవాలన్న ఆసక్తిని పెంచుతోంది. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పుస్తక ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసేలా ఇది ఏటా అలసరిస్తోంది. బుక్ ఫెయిర్.. సాహితీ ప్రియులున్న పట్టణాల్లో బుక్ ఫెయిర్ ఒక అనిర్వచనీయమైన అనుభూతిని మిగులుస్తోంది. మరింత విజ్ఞానాన్ని సముపార్జించాలని భావిస్తున్న వారికి ఇక్కడ లభించే ఎన్నో పుస్తకాలు ఆహ్వానం పలుకు తున్నాయి. డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతుందనడానికి ఇక్కడికి వస్తున్న సందర్శకులే నిదర్శనం. పుస్తకాలతో అనుబంధం ప్రతి ఒక్కరికీ ఉండాలి. అక్షరా భ్యాసంతో ఆరంభమయ్యే ఈ అభిరుచి నిరంతరం నిరాఘాటంగా కొనసాగుతుంది. పుస్తకాలు ప్రియమైన నేస్తాలు. డిజిటల్ యుగం లోనూ పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంటుంది. బుక్ ఫెయిర్ ఒక అద్భుత పుస్తకాల సమూహం. సాహితీవేత్తల సాహిత్య సమాహారం బుక్ ఫెయిర్. అదొక అద్భుత ప్రపంచం. అదొక విలక్షణ మైన అనుభూతి చిహ్నం. వేల పుస్తకాలు ఒక చోట సమావేశమయినట్టు.. ఏడాదిపాటు ఎదురు చూపులకు స్వస్తిపలుకుతూ ఒక చోట చేర్చే సందర్భం బుక్ ఫెయిర్. విభిన్న రచయితల సాహిత్యాలను ఒక చోట ఏరి కూర్చుకుంటారు. చెప్పనలవి కాని అనుభూతికి సంకేతం బుక్ ఫెయిర్. పుస్తకం ఒక విజ్ఞాన భాండాగారం. ఎప్పటికప్పుడు మన అవగాహనను పెంచుకోవడానికి అది అందించే విజ్ఞానం ఉపకరిస్తుంది. విజ్ఞానాన్ని పెంచుకోవడంతో బాటు, మనలో మనల్ని తెలుసుకునేలా చేస్తుంది. పుస్తకం మనచుట్టూ ప్రపంచాన్ని మనం తెలుసుకునేలా చేసే అపురూప సాధనంగా చూడాలి. అంతర్లీనంగా పుస్తకం అందించే విజ్ఞానం మన సామాజిక జీవనాన్ని నిర్దేశిస్తుంది. ఎన్నిపుస్తకాలు చదివితే అంతగా విజ్ఞానం అబ్బుతుంది. అందువల్ల పుస్తక ప్రియులు ఎలాగూ పఠనం చేస్తారు. ఆ అలవాటు లేనివారు సైతం అలవాటుచేసుకుంటే తమజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారు. అందువల్ల ఇప్పటి నుంచయినా పుస్తకాన్నిచదవండి అనే వారికి ఇలాంటి బుక్ ఫెయిర్ ఉపయుక్తంగా ఉంటుంది.

# గ్రంథాలయలాను ఆధునీకరించాలి

### అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

హైదరాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అతంతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు.

పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది. ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలున్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శనమి స్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో పుస్తక మహోత్సవాలను హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు వంటి ప్రముఖ పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహి స్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మార్కెట్లో వచ్చే కొత్త పుస్తకాలపై అవగాహన ఏర్పడటం లేదు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిం చాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి.

# నయాసాల్ కోసం నగర ప్రజల ఆసక్తి

### ఏర్పాట్లలో యువత బిజీ

హైదరాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): నూతన సంవత్సర వేడుకలను ఎంజాయ్ చేసేందుకు జంటనగరాల ప్రజలు సిద్ధమవుతున్నారు. నయా సాల్ ముబారక్‌లో పాల్గొనేందుకు యువత మాత్రవే కాదు.. పెద్దలు సైతం నంబరాలను ఘనంగా నిర్వహించుకునేందుకు రెడీ అయ్యారు. అధిక శాతం మంది పబ్బులు, హోటళ్ళ, రిసార్ట్‌లకు వెళ్లేందుకు ఇప్పటికే బుకింగ్‌లు పూర్తి చేసుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించి ఇంట్లోనే సెలబ్రేట్ చేసుకునేలా మరికొందరు ప్లాన్ చేస్తున్నారు. డిసెంబరు 31కి వీడ్కోలు పలికి న్యూ జోష్‌ను నింపుకోవాలని ఎక్కువమంది భావిస్తున్నారు. పిల్లలు, యువత మాత్రమే కాదు పెద్దవారు సైతం వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో పెద్దఎత్తున వేడుకలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లైటింగ్‌లు, డిజెలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా బంధువులు, స్నేహితులతో కలిసి విందు, వినోదాల్లో పాలుపంచుకోవడం చూస్తున్నాం.

ఎక్కువ మంది వేడుకలను ఇంటి వద్దే చేసుకునేందుకు ఆసక్తి చూపారు. యువత మాత్రం పబ్బులు, ఇతర ప్రాంతాలకు వెళ్తామంటున్నారు. నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని వర్గాల వారు ఆసక్తి చూపించారు. పెద్దగా స్థోమత లేనివారు. డిసెంబరు 31 రాత్రిని ఇంట్లోనే జరుపుకొనేందుకు ప్రాధాన్యమిస్తామంటున్నారు. స్నేహితులు, బంధువులను ఇంటికి ఆహ్వానిస్తామని ,పబ్‌లు, హోటళ్లకు వెళ్తామని చెబుతున్నారు. పబ్బుల్లో గతేడాదికంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ధరలు భారంగా ఉన్నా, ఏడాదికోసారి వచ్చే వేడుక కాబట్టి భరించక తప్పడం లేదన్నారు.ఎక్కువగా సంపన్నవర్గాలు ఉండే ప్రాంతాల్లో పబ్‌లు, హోటళ్లకు, రిసార్టులకు ప్రాధాన్యమిచ్చారు.

## ఆదిలాబాద్ మున్సిపాలిటీపై గురి

**మరోమారు గులాబీ జెండా ఎగురేసేందుకు ఉత్సుకత**

**నేడు కార్యకర్తలతో సన్నాహక సమావేశం**

ఆదిలాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేసేందుకు టీఆర్ఎస్ నాయకులు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు టీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలుస్తున్నారు. ప్రభుత్వం ఆరు సంవత్సరాలుగా చేపడుతు న్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల ఉపాధిని ఎంతో మెరుగు పర్చాయి. దీంతో ప్రజలు గులాబీ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపిస్తున్నారు. మరోమారు ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికలకు టీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేసేందుకు పార్టీ నాయకులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 29న ఆదిలాబాద్‌లో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సన్నాహక సమావేశం జరుగనున్నది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జరుగనున్న ఈ సమావేశంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లోని కమిటీ సభ్యులతో నాయకులు రెండ్రోజులుగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం జరిగే సమావేశానికి వార్డు కమిటీలకు చెందిన సభ్యులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయంపై చర్చించనున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరునున్నాయి. జనవరి 8 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభంకానుండగా ఈ లోగా అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయడంతో పాటు మెజార్టీ వార్డుల్లో గులాబీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో పాటు మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకునేలా నాయకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 29న పట్టణ శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి వార్డు కమిటీలో సభ్యులు హాజరుకానుండగా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం సాధించడానికి తీసుకుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఆదివారం జరిగే సన్నాహక సమావేశంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో టీఆర్ఎస్ నాయకులు వార్డు కమిటీల సభ్యులతో రెండ్రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ముగ్గురు నాయకులతో కలిపి కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులో టీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది కమిటీలు ఉండగా మగ్గురు నాయకులతో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు మున్సిపల్ పరిధిలో మూడు నుంచి ఐదు వార్డులకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలతో ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలు, ఇతర అంశాలను చర్చించడంతో పాటు వార్డుల కమిటీ సభ్యులు సన్నాహక సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం జరిగే సన్నాహక సమావేశం 6 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మావేశానికి టీడీడీసీ చైర్మన్ లోక భూమారెడ్డి,మాజీ మంత్రి జోగురామన్న తదితరులు హాజరు కానున్నారు.

## నకిలీలపై అప్రమత్తత అవసరం

మెదక్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి) వినియోగదారుడు తాము కొనుగోలు చేసే ప్రతి వస్తువును నిశితంగా పరిశీలించి, ప్రతి వస్తువుకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా తూనికలు కొలతల అధికారి భూలక్ష్మి

సూచించారు. అప్పుడే నకిలీలపై లేదా ఇతరత్రా అమ్మకాలపై చర్యలు తీసుకునే అవకావం వస్తుందని అన్నారు. వినియోగదారుడు మోసపోయినట్లు గుర్తిస్తే వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి నష్టపరిహారం పొందవచ్చునన్నారు. ప్రతి వస్తువు లేదా ఉత్పత్తులకు సంబంధించిన కొనుగోళ్లకు రశీదు తప్పకుండా తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు రశీదులు ఉంటే మోసాలు జరిగినప్పుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. రశీదులు తీసుకోకుండా వస్తువులను కొనుగోలు చేయడం అంటే మోసపూరిత వ్యాపారాలను ప్రోత్సహించడమేనన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. మానవ సంబంధాలను తమ పిల్లలకు నేర్పించాలన్నారు. వ్యాపారులు నాణ్యత లేని వస్తువులను రశీదులు లేకుండా వినియోగదారులకు అందించి మోసం చేస్తారన్నారు.

## పల్లె ప్రగతికి అందరూ సిద్ధం కావాలి

**–గ్రామాల వారిగా ప్రణాళికలు సిద్ధం చేయాలి**

గద్వాల,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): రెండో విడత పల్లె ప్రగతికి అందరూ సిద్ధంగా ఉండాలని జేసీ నిరంజన్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయితికి డంపింగ్‌యార్డ్, శ్మశానవాటిక ఉండాలని, అందులో ఏ ఒక్క దానికి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. అవసరమైతే స్థలం కొనుగోలు చేసి వాటి నిర్మాణం చేయాలన్నారు. ప్రతి జీపీ వారు ట్రాక్టర్ కొనాల్సిందే ఆమె స్పష్టం చేశారు. 255 గ్రా మ పంచాయతీల్లో 148 జీపీలకు చెక్ జ నరేట్ చేయడం జరిగిందని మిగిలిన జీ పీల విషయంలో వేగవంతం చేయాలన్నారు. జీపీకి లోన్ అకౌంట్ ఓపెన్ చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఇంకా 134 జీపీల్లో డంపింగ్‌యార్డ్ పనులు ప్రారంభంకానట్లు తెలిసిందని, అన్ని జీపీల్లో డంపింగ్ యార్డులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఇకపై అధికారులతో ప్రతి వారం వీటిపై సమీక్ష ఉంటుందని ఈ విషయా న్ని అధికారులు గమనించి ప్రతివారం పూర్తయిన జాబితాతో సమావేశానికి రావాలని సూచించారు. డంపింగ్ యార్డ్, శ్మశాన వాటికకు ప్రభుత్వం స్థలం అందుబాటులో లేని గ్రామాల విషయంలో మండల అభివృద్ధి అధికారి, తాసిల్దార్ కలిసి ఉమ్మడి నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పారిశుధ్యం, హరితహారం వంటి విషయాల్లో పూర్తిగా పంచాయతీ కార్యదర్శులే బాధ్య త వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో మురుగునీటి సమస్య లేకుండా ఇంకుడుగుంతల ఎస్టిమేట్ తీసుకుని వాటిని పూర్తి చేయాలన్నారు.

## కరీంనగర్‌ను అభివృద్ధిలో ముందుంచుతా: గంగుల

కరీంనగర్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి): రాబోయే రోజుల్లో కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలో రెండో స్థానంలో ఉండేలా తీర్చిదిద్దుతామని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో నగరంలో ఐటీ టవర్ ప్రాజెక్టును తీసుకువచ్చామని పేర్కొన్నారు. దాదాపు పనులన్నీ పూర్తి కావచ్చాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదనీ, ఐదేళ్ల కాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను చేపట్టిందని పేర్కొన్నారు.

ప్రజల మధ్యలో ఉండే పార్టీ టీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు టీఆర్ఎస్‌లోకి రావడం అభినందనీయమన్నారు. ప్రజలకు నీతివంతమైన పాలనను అందించేది టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజలకు తమ పార్టీ మీద అపారమైన నమ్మకం ఉందన్నారు. గత పాలకుల హయాంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. కానీ, స్థానిక సంస్థలను బలోపేతం చేయాలన్న ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ఏడాదికి రూ. 100 కోట్లు కేటాయిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే నగరాభివృద్ధికి రూ. 350 కోట్లు ఇచ్చారని చెప్పారు. నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు.

## ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని
# టీఆర్ఎస్ ప్రయత్నం
### - కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్28(ఆర్ఎన్ఎ) : మున్సిపల్ ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని తమ ఘనతగా చెప్పుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సంగారెడ్డిలో అభివృద్ధి జరిగిందని జగ్గారెడ్డి తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు తర్వాత అభ్యర్థులను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డి మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి బీసీలకు కేటాయిస్తే.. నిర్మలా జగ్గారెడ్డికి టికెట్ ఇస్తామన్నారు. సంగారెడ్డి, సదాశివపేటలో కాంగ్రెస్‌దే గెలుపని జగ్గారెడ్డి జోస్యం చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలన అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలతో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఒకపక్క సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, సీఎం కేసీఆర్ మాత్రం అధికారాన్ని అడ్డుపెట్టుకొని తన పార్టీని ఎలా బలోపేతం చేసుకోవాలి, తమ కుటుంబ సభ్యులు, అనుయాయుల ఆస్తులు ఎలా పెంచుకోవాలని ఆలోచిస్తున్నారని విమర్శించారు. రెండవ దఫా అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందని అన్నారు. వచ్చే నెల జరిగే ఎన్నికల్లో ఈ విషయం స్పష్టం అవుతుందని జగ్గారెడ్డి అన్నారు. దీంతో టీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారని, డబ్బులు ఎగజల్లి మున్సిపాలిటీల్లో గెలవాలని చూస్తున్నారని, ప్రజలంతా ఏకమైన టీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

## రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాన్ని
# టీఆర్ఎస్ సమర్థించదు
### - ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్

కరీంనగర్, డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి) : రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాన్ని టీఆర్ఎస్ పార్టీ సమర్థించదు అని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పౌరసత్వ సవరణ చట్టం విషయంలో భారతీయ జనతా పార్టీ ఆలోచన విధానం సరైంది కాదన్నారు. ఈ దేశాన్ని రాజ్యాంగమే కాపాడుతుందన్నారు. మతంపై రాజకీయాన్ని తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ వందకు వంద శాతం విజయం సాధిస్తుందని వినోద్ ధీమా వ్యక్తం చేశారు. టికెట్లు అందరికి ఇవ్వలేమని, కొన్ని సందర్భాల్లో వ్యక్తుల పలుకుబడి, సామాజిక పరమైన అంశాలు చూడాల్సి వస్తుందన్నారు. గెలుపోటములు సమానమే అని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తెచ్చిన ఘనత గులాబీ జెండాదే అని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ గెలువడానికి చాలా కారణాలు ఉన్నాయి. మోదీ కోసం నాడు ఓటేశారు. ఇప్పుడు మోదీ అవసరం లేదు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలిచినా చేసేది ఏమీ లేదని వినోద్ తేల్చిచెప్పారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో..
# మూడు రాజధానులే రెఫరెండం
### - రాజకీయం కాదు.. రాజధాని కోసం మాట్లాడుతున్నా
### - ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాఖపట్టణం, డిసెంబర్28(ఆర్ఎన్ఎ) : త్వరలో ఏపీలో ప్రభుత్వం నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు రాజధానులే రెఫరెండం అని ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఏపీకి మూడు రాజధానులను వ్యతిరేకించేవారంతా తుగ్లక్ లేనని అన్నారు. రాజధాని అమరావతి పేరుతో భూములను దోచుకుని కొల్లగొట్టినవారే ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు రాజధానులు అంశమే రెఫరెండం కాబోతుందని తమ్మినేని అన్నారు. ప్రస్తుతం టీడీపీకి ఉన్న ఎమ్మెల్యేలను దక్కించుకోవాలని లేదా అంటూ టీడీపీకి కౌంటరిచ్చారు స్పీకర్ తమ్మినేని. నేను రాజకీయం కోసం మాట్లాడటంలేదు రాజధాని కోసమే తాను మాట్లాడుతున్నానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. విశాఖను రాజధానిగా ప్రకటించటం వల్ల ఉత్తరాంధ్రా అభివృద్ధి జరగుతుందనీ దాన్ని వ్యతిరేకించావారంతా ఉత్తరాంధ్రా అభివృద్ధిని కోరుకోనివారేనని ఆరోపించారు. మాజీ మంత్రి అచ్చెన్నాయుడిపై తమ్మినేని సెటైర్లు వేశారు. విశాఖను రాజధాని చేస్తామంటే అచ్చెన్నాయుడు గాబరా పడుతున్నారనీ, వారు ఎటువంటి హంగామా చేసినా జరిగేది జరుగక మానదని అన్నారు. ఇన్ సైడర్ ట్రేడింగ్ చేయటమే కాదు ప్రభుత్వం చేసిన వాటిని సమర్థించటం కూడా అలవాటు చేసుకోవాలని, రాజధాని పేరుతో భూముల్ని దోచుకుందామనుకున్నారు తప్ప మరే ఆలోచన గత ప్రభుత్వానికి లేదని విమర్శించారు. వారి అవినీతి బైటపడుతుందని ప్రజల్ని రెచ్చగొట్టి ఆందోళన చేయిస్తున్నారని స్పీకర్ ఆరోపించారు.



## అయ్యప్పస్వామిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్,డిసెంబర్28: నిర్మల్ పట్టణంలోని హరిహర క్షేత్రం ఆలయ అయ్యప్పస్వామిని ఇవాళ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గురుస్వాములు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం 2020 సంవత్సరం ఆలయ క్యాలెండర్ ను మంత్రి ఇంద్రకరణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువ నాయకులు అల్లోల గౌతంరెడ్డి, జిల్లా ఎస్పీ శశిధర్ రాజు, నాయకులు సత్యనారాయణ గౌడ్, మురళీధర్ రెడ్డి,తిరుపతి రెడ్డి, పాకాల రాం చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులకు ఎయిర్‌టెల్ షాక్
### ప్రీపెయిడ్ ప్లాన్‌లో 26 రోజుల కోత

న్యూఢిల్లీ,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): ఎయిర్‌టెల్ తన ఖాతాదారులకు షాక్ ఇచ్చింది. రూ. 558 ప్రీపెయిడ్ ప్లాన్ కాలపరిమితిని భారీగా తగ్గించింది. ఏకంగా 26 రోజులు తగ్గించి భారీ షాక్ ఇచ్చింది. కాలపరిమితిని తగ్గించినా మిగతా ప్రయోజనాలను మాత్రం యథాతథంగా ఉంచింది. ఎయిర్‌టెల్ రూ. 558 ప్రీపెయిడ్ ప్లాన్‌లో ఇప్పటి వరకు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 3జీబీ డేటా, 100 ఎస్సెమ్మెస్‌లు 82 రోజుల కాలపరిమితితో లభించేవి. ఇప్పుడు మిగతా ప్రయోజనాలను అలాగే ఉంచి కాలపరిమితిని 82 రోజుల నుంచి 56 రోజులకు తగ్గించింది. అంటే ఏకంగా 26 రోజులను తగ్గించింది. ఫొటోగ్రఫీ నుంచి మ్యూజిక్ వరకు ఏదైనా ఇష్టమైన కోర్సును ఉచితంగా నేర్చుకునే అవకాశం కల్పిస్తోంది. షా అకాడమీ ద్వారా నాలుగు వారాలపాటు ఈ కోర్సు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. అలాగే, వింక్ మ్యూజిక్ సబ్‌స్క్రిప్షన్, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ యాప్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ లభిస్తాయి. జీ5, హూక్, 370కిపైగా లైవ్ టీవీ చానళ్లు, 10 వేలకు పైగా సినిమాలు వీక్షించవచ్చు. దీంతోపాటు ఫాస్టాగ్‌పై రూ. 100 క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఈ ప్యాక్ అన్ని సర్కిళ్లలోనూ అందుబాటులో ఉంది. ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్ ద్వారా కూడా రీచార్జ్ చేసుకోవచ్చు.

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంచిర్యాల,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 304 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు శుక్రవారం చెక్కులను అందజేశారు. జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఈ చెక్కులను అందజేశారు. అదేవిధంగా పెళ్లి కానుకగా బాల్క ఫౌండేషన్ ద్వారా మహిళలకు చీరలని బహూకరించారు. అనంతరం అందరితో కలిసి సామూహిక భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజధానిపై అధ్యయనానికి.. హైపవర్ కమిటీ

- ■ కమిటీ నివేదికపై సమీక్షించిన తరువాతే ప్రకటన
- ■ రాజధానిలో భూ ఆక్రమాలపై సీబీఐ లేదా లోకాయుక్త విచారణ
- ■ రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు
- ■ వారిపట్ల సీఎం జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు
- ■ అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయమే జగన్ తీసుకుంటారు
- ■ విజయసాయిరెడ్డి విశాఖకు చెందిన నాయకుడు
- ■ అందుకే విశాఖలోనే రాజధాని అని ఉండొచ్చు
- ■ రాయపట్నం పోర్టుకు ముందడుగు పడింది
- ■ త్వరలోనే నిర్మాణం చేపడతాం
- ■ 412 కొత్త 108 అంబులెన్స్‌లు కొనుగోలుకు నిర్ణయం
- ■ మద్దతు ధరతో పంటలను కొనుగోళ్లు చేసేలా కేబినెట్ నిర్ణయించింది

### - సమాచార శాఖ మంత్రి పేర్ని నాని

అమరావతి, డిసెంబర్28(ఆర్ఎన్ఎ) : రాజధానిపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతిలోనా.. విశాఖలోనా అనే సంశయానికి నేటితో తెరపడుతుందనుకున్నప్పటికీ కేబినెట్ హైపవర్ కమిటీని తెరపైకి తెచ్చింది. శుక్రవారం అమరావతిలో మంత్రి మండలి ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని సమాచారశాఖ మంత్రి పేర్ని నాని అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ రాజధానిపై మరో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. ఈ భేటీలో జీఎన్ రావు కమిటీ రిపోర్ట్‌పై చర్చ జరిపిన మంత్రివర్గం.. బోస్టన్ కన్‌స్టలెన్సీ రిపోర్ట్ అందాల్సి ఉందని, ఈ రిపోర్టు వచ్చాక ప్రభుత్వం ఏర్పాటు చేసే హైపవర్ కమిటీ పరిశీలించి అధ్యయనం చేసి నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకోవాలని భావిస్తోందని తెలిపారు. ఈ హై పవర్ కమిటీలో మంత్రులు, న్యాయ నిపుణులు ఉంటారని అన్నారు. జనవరి మూడు తర్వాత బోస్టన్ కన్‌స్టలెన్సీ నివేదిక వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాతే రాజధానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు నాని పేర్కొన్నారు.

శివరామకృష్ణ కమిటీని కాదని అప్పటి మంత్రి నారాయణ కమిటీని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాజధానికి భూ సమీకరణ చేశారన్నారు. ప్రాథమికంగా 32 వేల ఎకరాలు, మరో 20వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం చేయాలని అప్పట్లో నిర్ణయించారని, వాస్తవాలను మరచి గత ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి సంకల్పించిందని నాని తెలిపారు. రూ. లక్షా 9వేల కోట్ల పెట్టుబడులు అవసరమని భావించి కేవలం రూ. 5వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగిందని అన్నారు. అనుభవజ్ఞులైన గత సీఎం రూ. లక్ష కోట్లు అప్పు తెస్తామని కేవలం రూ. 5వేల కోట్లు మాత్రమే తేగలిగారని, రూ. లక్ష కోట్లు తేవాలంటే ఎంతకాలం పడుతుందో ప్రజలు అంచనా వేసుకోవాలని అన్నారు. మేమే తేగలిగినంత తెచ్చాకెవరు అప్పు ఇస్తారని గత ఆర్థిక మంత్రి వ్యాఖ్యానించారని నాని గుర్తు చేశారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రాయలసీమ నీటిపారుదల ప్రాజెక్టులకు మరో రూ. లక్ష కోట్లు అవసరం ఉందని, ఆస్పత్రుల అభివృద్ధికి రూ. 14వేల కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ. 12వేల కోట్లు, అమ్మ ఒడి పథకానికి రూ. 6వేల కోట్లు.. ఇలా చాలా నిధులు అవసరమవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి, ప్రజల అవసరాలు, భవిష్యత్తు చూడాలా.. కలల రాజధాని నిర్మాణం ఎప్పటికి చేయగలం.. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి రాజధాని నిర్మాణం చేసే పరిస్థితి వస్తే హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో ఎప్పటికి పోటీ పడగలం అనే దానిపై మంత్రివర్గంలో చర్చ జరిగిందని అన్నారు. ఇదిలా ఉంటే అమరావతి ప్రాంతంలో జరిగిన అవకతవకలపై మంత్రి మండలి ఉప సంఘం నివేదిక ఇచ్చినట్లు సమాచారశాఖ మంత్రి పేర్ని నాని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులు జరిగినట్లు గుర్తించామని, 2014 డిసెంబర్ ముందు జరిగిన భూముల కొనుగోళ్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో అవినీతి విచారణ కోసం న్యాయ నిపుణుల సలహా తీసుకొని సీబీఐ, సీఐడీ, లోకాయుక్తకు అప్పగించాలా అన్నదానిపై నిర్ణయం తీసుకుంటామన్నామని తెలిపారు. గత టీడీపీ హయాంలో మాజీ మంత్రులు తమ కారు డ్రైవర్లతో పాటూ ఇంట్లో పనిచేసే వారి పేర్లపై భూములు కొనుగోలు చేశారని నాని అన్నారు. చాలామంది అవినీతిని బయటపెట్టాలని సవాళ్లు చేశారని.. పాపం పండిన రోజు అంతా బయటపడుతుందన్నారు. కేబినెట్ మిగిలిన నిర్ణయాల విషయానికి వస్తే.. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికలు రిజర్వేషన్లు ఖరారు చేసిందని అన్నారు. అలాగే 412 కొత్త 108 వాహనాలు.. 656 కొత్త 104 వాహనాలు కొనుగోలు చేయాలని తీర్మానం చేసినట్లు నాని స్పష్టం చేశారు. 341శాశ్వత పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుతో పాటు పసుపు, మిర్చి, ఉల్లి, చిరు ధాన్యాలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇటు మచిలీపట్నం పోర్టును ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాలని కేబినెట నిర్ణయం తీసుకుందని, రూ. 10009వేల కోట్ల అంచనాలతో రామాయపట్నం పోర్ట్ నిర్మించాలని.. దుగరాజు పట్నం పోర్ట్ బదులు రామాయపట్నం పోర్టు నిర్మించడానికి కేబినెట్ ఓకే చెప్పిందని నాని తెలిపారు. పోర్టు నిర్మాణంపై అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. రెండు పోర్టులకు డీపీఆర్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని పేర్ని నానా స్పష్టం చేశారు. రాజధానులపై సీఎం జగన్ ప్రకటన చేయలేదని నాని అన్నారు. పరిపాలనా వికేంద్రీకరణ గురించి చెబుతూ ఎక్కడ ఏది ఉండొచ్చు అని మాత్రమే చెప్పారు. రాజధానిపై ప్రభుత్వం తరఫున ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అందరికీ ఆమోదయోగ్యంగా సానుకూల నిర్ణయం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఒక నిర్ణయానికి రాకముందే హడావిడి చేస్తున్నారని , అది సరైన పద్ధతి కాదని మీడియా ప్రతిపతినిధులకు నాని సూచించారు. కాగా విజయసాయిరెడ్డిసైతం ఇలాంటి వ్యాఖ్యలు చేశారు అని విలేకరులు ప్రశ్నించగా.. విజయసాయిరెడ్డి ఒక రాజకీయ నాయకుడని, విశాఖ జిల్లాకు వైకాపా ఇన్‌ఛార్జ్ అన్నారు. రాజకీయ ప్రముఖుడిగా ఆయనన్నది ఆయన కోరికై ఉంటుందని మంత్రి పేర్ని నాని వివరించారు.

# కార్గో బస్సులను పరిశీలించిన మంత్రులు

హైదరాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): నూతనంగా ప్రవేశపెట్టబోతున్న ఆర్టీసీ కార్గో బస్సు సర్వీసు, సంచార బయో సౌచాలయ బస్సులను నగరంలోని జూబ్లీ బస్‌స్టాండ్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలోని ప్రతీమూలకు ఆర్టీసీ కార్గో సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని చోట్ల సరకు రవాణాకు రంగం సిద్ధమైందని పేర్కొన్నారు. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకుని వచ్చే క్రమంలో కార్గో సర్వీసులను ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ఉద్యోగులకు టాయిలెట్స్, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటుచేయాలని ప్రగతిభవన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డిపోల్లో తాత్కాలిక ప్రాతిపదికన టాయిలెట్లు ఏర్పాటయ్యాయి. ఉద్యోగులకు ఛేంజ్ ఓవర్ పాయింట్‌లలో సంచార బయో టాయిలెట్లను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా పాత బస్సుల్లో టాయిలెట్లను ఏర్పాటుచేశారు. నగరంలో తొమ్మిది ఛేంజ్ ఓవర్ పాయింట్లలో మొదట వీటిని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులతో నిర్వహించిన వనభోజనాల సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వీటిని ప్రారంభించారు.




జూబ్లీ బస్సు స్టేషన్‌లో ఆర్టీసీ కార్గోబస్సును పరిశీలించిన మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, మల్లారెడ్డి

# పౌరసత్వ చట్టంతో దేశంలో ఎవరికీ కీడు లేదు
### కాంగ్రెస్ దుష్ప్రచారాలను నమ్మొద్దు
### అలాంటి క్లాజ్ ఉంటే చూపాలి: అమిత్ షా

న్యూఢిల్లీ,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టంపై పెల్లుబుకుతున్న నిరసనల నేపథ్యంలో ముస్లింలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా గట్టి భరోసా ఇచ్చారు. ఈ చట్టం ద్వారా ఎవరూ పౌరసత్వాన్ని కోల్పోరని స్పష్టం చేశారు. మైనారిటీల మనసుల్లో కాంగ్రెస్ భయం నింపుతోందని ఆరోపించారు.

హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ మైనారిటీల మనసుల్లో కాంగ్రెస్ పార్టీ భయం నింపుతోందని ఆరోపించారు. మైనారిటీలు ఏ విధంగానూ భయపడవద్దని, ఎవరి పౌరసత్వాన్నీ తొలగించేది లేదని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టంపైనా, జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్సీ)పైనా కాంగ్రెస్ పుకార్లు ప్రచారం చేస్తోందని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం ద్వారా కనీసం ఒకరి పౌరసత్వాన్ని అయినా తొలగించబోమని తెలిపారు. మైనారిటీల పౌరసత్వాన్ని తొలగిస్తారంటూ వదంతులను కాంగ్రెస్ అండ్ కో ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అమిత్ షా ఓ సవాల్ విసిరారు. పౌరసత్వాన్ని తొలగించేందుకు వీలు కల్పించే నిబంధన కనీసం ఒకటి అయినా ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టం బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల నుంచి వచ్చిన మైనారిటీల కోసమని తెలిపారు.

#### దేశ లౌకికి తత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు

పౌరసత్వ సవరణ బిల్లుతో దేశ లౌకికత్వానికి వచ్చే ఇబ్బంది ఏమీ ఉండదని కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఈ విషయంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి, దేశ విరుద్ధ శక్తులను సమీకరించి హింసను ప్రేరేపించడానికి ప్రతిపక్షాలు సర్వ శక్తులను ఒడ్డుతున్నాయని మండిపడ్డారు. సవరణ బిల్లు వల్ల దేశంలోని ఏ వర్గానికి నష్టం వాటిల్లదని, మైనారిటీలను బెదిరించే చర్యలో భాగంగా సీఏఏను తెచ్చారన్న విపక్షాల మాటలన్నీ తప్పుడు మాటలని, వాటిని నమ్మవద్దని కోరారు. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ముస్లింలు భారత పౌరసత్వం దరఖాస్తు చేసుకోవడం కుదరదన్నది అవాస్తవని, మోదీ హయాంలో 600 మంది ముస్లింలకు భారత పౌరసత్వం కల్పించామని పూరీ స్పష్టం చేశారు.

# మేడారంలో చురుకుగా పనులు
### భూములిచ్చిన రైతులకు ఉపాధి

ములుగు,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): మేడారం మహాజాతరలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు భూములు అవసరం కాగా, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ భూములిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. గతంలో పనిచేసిన కలెక్టర్లు, అధికారులు మేడారంలో సౌకర్యాల కల్పన కోసం ఎంతో భూమిని సేకరించారు. బాధితులకు నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు రాలేదు. కాగా, కలెక్టర్ ముగ్గురు రైతులకు ఉపాధి చూపుతామని హామీ ఇచ్చినా వారు భూములు ఇవ్వకపోవడంతో రైతులకు ఇష్టం లేకపోయినా భూములను స్వాధీనం చేసుకున్నారు. పనులను ప్రారంభించారు. ఇచ్చిన హామీని నెరవేర్చారు. నిర్వాసితుల కుమారులకు ఉద్యోగాలు ఇచ్చారు.మేడారం సమ్మక్క–సారక్కల మహా జాతర అభివృద్ధి పనులకు భూములిచ్చిన ముగ్గురు రైతులకు ఉద్యోగ అవకాశం కల్పించారు. మేడారం వచ్చే భక్తులకు విడిది సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. భక్తులకు ఉపయోగకరంగా ఉండే మూడు ప్రాంతాల్లో స్థలాన్ని గుర్తించారు. స్థలాన్ని ఇవ్వబోమని రైతులు మొండికేయడంతో రైతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. చిలకలగుట్ట, రెడ్డిగూడెం గ్రామాల సమీపంలోని భూములను సేకరించి షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మేడారంలోని హరిత హోటల్ నిర్మాణానికి భూములిచ్చిన బాపిరెడ్డికి ఉద్యోగ అవకాశం కల్పించారు. ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఇప్పసాయికిరణ్, తాళ్లపెల్లి లక్ష్మణ్, ఎనగం దుల అనితలకు డీపీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియమించి, నియామక పత్రాలను అందజేశారు.

# పంటలబీమాకు రైతులకు ప్రోత్సాహం
### అధికారులకు జెసి సూచనలు

కరీంనగర్,డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి ): యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో గ్రామాల వారీగా పంటల విస్తీర్ణంపై రైతుల నుంచి సరైన వివరాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు.జనవరి మాసం చివరి వరకు వరి నాట్లు పూర్తికానున్న దృష్ట్యా ఈ నెల 31వ తేదీలోగా వరిపంట రైతులతో బీమా చేయించాలని అధికారులను ఆదేశించారు. రైతులు యాసంగి సీజన్‌లో ఏయే పంటలు వేస్తున్నారో తెలుసుకుని అందుకు తగిన సమాచారాన్ని పంపించాలన్నారు. పంటలకు సంబంధించి మద్దతు ధర వివరాలు కూడా రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు ఏఈఓలు నేరుగా వెళ్లి ధాన్యం సమాచారం సేకరించి రైతుల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం నాణ్యతకు సంబంధం లేకుండా ఎలా ఉంటే అలాగే వివరాలు అధికారుల దృష్టికి తీసుకురావాలనీ, దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే యాసంగి సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి రైతు పంటబీమాను చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి డీలర్లు, తదితరుల నుంచి సమాచారం తీసుకోవాలనీ, జిల్లాలో ఈ సీజన్‌కు గాను 15 వేల మంది రైతులకు పంట బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## టీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమాపత్రాలు అందజేత



నిజామాబాద్ , డిసెంబర్ 28: ఇటీవల సెంట్రింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయిన టీఆర్ఎస్ కార్యకర్త వరికుప్పల గంగారాం అలియాస్ గంగాధర్ కుటుంబ సభ్యులకు టీఆర్ఎస్ పార్టీ తరుపున బీమా నగదు మంజూరైంది. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఇన్సూరెన్స్ కంపెనీ జారీ చేసిన రూ. 2 లక్షల నగదు బీమా పత్రాలను గంగారాం భార్య సవితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, ఇతర నేతలు ఖాందేష్ సత్యం, షేక్ ఇస్తాఖ్, బండారి నరేశ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ వడ్డెర కాలనికి చెందిన గంగారాం సెంట్రింగ్ పనిచేస్తుండగా మూడంతస్తుల భవనంపైనుండి కింద పడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# క్యాష్ విత్‌డ్రాకు ఓటీపీ




న్యూఢిల్లీ,డిసెంబర్ 28:: ఏటీఎం కార్డు జేబులో ఉండగానే మనకు తెలియకుండా ఖాతా నుంచి డబ్బులు డ్రా చేస్తున్న ఫిర్యాదులు ఇటీవల సైబర్‌క్రైమ్ పోలీసులకు విపరీతంగా వస్తున్నాయి. ఏటీఎం కార్డులు ఖాతాదారుల వద్ద ఉండగా..ఏటీఎం సెంటర్ల నుంచి డబ్బులు డ్రా అవుతున్నాయంటే గుర్తుతెలియని వ్యక్తులు ఆయా బ్యాంకు కార్డులను క్లోనింగ్ చేసి ఉంటారు. ఈ నేపథ్యంలోనే నగదు అక్రమలావాదేవీలు, ఏటీఎం మోసాలను అరికట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన వినియోగదారులకు కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జనవరి 1 2020 నుంచి ఇకపై దేశవ్యాప్తంగా అన్ని ఎస్‌బీఐ ఏటీఎంల నుంచి క్యాష్ విత్‌డ్రా చేసుకోవాలంటే వన్‌టైం పాస్‌వర్డ్(ఓటీపీ)తోనే నగదు డ్రా చేసుకోగలరు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటలకు ఓటీపీ విధానం వర్తిస్తుందని బ్యాంకు పేర్కొంది. పదివేలు, అంతకన్నా ఎక్కువ క్యాష్ ఉపసంహరణకు ఓటీపీ ఎంటర్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. ఏటీఎం క్యాష్ విత్‌డ్రా సమయంలో ఖాతాతో అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. అక్రమ, అనుమానాస్పద నగదు లావాదేవీలకు చెక్‌పెట్టేందుకు కొత్త సదుపాయం తీసుకొచ్చినట్లు ఎస్‌బీఐ పేర్కొంది.

# భద్రాచలంలో అధ్యయనోత్సవాలకు శ్రీకారం
### తొలిరోజు మత్స్యావతారంలో రామభద్రుడు

భద్రాచలం,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రీ వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఆరంభమయ్యాయి. తొలి రోజున స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు శ్రీ సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక స్నపనం, ప్రత్యేక పూజలు అర్చక స్వాములు నిర్వహించారు. ఇదే సమయంలో వైదిక సిబ్బందికి దేవస్థానం ఈవో గజరాజు నరసింహులు దీక్ష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వైదిక సిబ్బంది సంప్రదాయ తొలక్కం నిర్వహించారు. అనంతరం మేళతాళాలు బాజాభజంత్రీలతో స్వామివారిని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకురాగా భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇదిలా ఉండగా అధ్యయనోత్సవాలు శుక్రవారం నుంచి జనవరి 16 వరకు నిర్వహించనున్నారు. తొలి పది రోజుల్లో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జనవరి 5వ తేదీన పవిత్ర గోదావరిలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి పవిత్ర గోదావరిలో హంసాలంకృత తెప్పపై తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 6న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారంలో స్వామి వారు తెల్లవారుజామున 5 నుంచి 6 గంటలకు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ క్రమంలో స్వామివారికి ప్రతినిత్యం నిర్వహించే నిత్యకళ్యాణలను నిలిపివేశారు. ఆరో తేదీ నుంచి 16 వరకు రాపత్తు సేవలు నిర్వహించనున్నారు. 17 నుంచి 19 వరకు విలాస ఉత్సవాలు, 22న విశ్వరూప సేవ సర్వదేవతా అలంకారం నిర్వహించనున్నారు.

## పెట్రోల్ బంకులో నీరు..వాహనదారుల ఆందోళన

నిజామాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారం పరిధిలోని శ్రీ చక్ర పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోలుకు బదులు నీరు వచ్చిన ఘటన కలకలం రేపింది. దాదాపు నలభై ద్విచక్ర వాహనాల్లో పెట్రోలు పోయగా.. అన్నింటిలోనూ నీరే వచ్చింది. దీంతో వాహనాలు దారి మధ్యలోనే ఆగిపోడటంతో బాధితులు బంకు వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ విషయంపై 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో కలిసి పెట్రోల్ బంకు వద్దకు చేరుకుని నమూనాలను పరిశీలించారు. వాటర్ బాటిల్‌లో పెట్రోల్ తీసుకుని దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని బాధితులకు ఎస్ఐ హామీ ఇచ్చారు. అయితే పెట్రోల్ స్టేషన్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో తమ వాహనాలు చెడిపోయాయని బాధితులు వాపోయారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు.

# రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం
### హాజరైన సిఎం కెసిఆర్, గవర్నర్ తమిళసై

హైదరాబాద్,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): శీతాకాల విడిదిలో ఉన్న రాష్ట్రపతి తన పర్యటన ముగింపు సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిది నిమిత్తం ఈ నెల 20న హైదరాబాద్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. పర్యటన ముగిసిన సందర్భంగా రాష్ట్రపతి శనివారం తిరిగి ఢిల్లీ వెళ్లనున్న నేపథ్యంలో సాయంత్రం ఎట్‌హోం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలు రంగాల ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులుకూడా హాజరయ్యారు. రాష్ట్రపతి దంపతులు స్వయంగా అందరినీ పరిచయం చేసుకోవడం విశేషం.

# మున్సిపల్ ఎన్నికల్లో పట్టుకు టీఆర్ఎస్ వ్యూహం

### ఉమ్మడి జిల్లాలో బలమైన క్యాడర్‌తో ధీమా
### డీలా పడ్డ కాంగ్రెస్...బలం చాటేందుకు బీజేపి రెడీ

ఖమ్మం,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలో మున్సిపోల్స్‌లో అత్యధిక స్థానాలనే గాకుండా అన్ని స్థానాలు దక్కించుకునేలా అధికార టీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఇప్పటికే గెలుపు గుర్రాలను గుర్తించిన స్థానిక నేతలు,రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. గత పంచాయితీ ఎన్నికల్లో లాగా సత్తా చాటాలని చూస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా పువ్వాడ అజయ్‌కుమార్ ఒక్కరే గెలుపొందినప్పటికీ.. ఆ తర్వాత నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, వైరా స్వతంత్ర ఎమ్మెల్యే, సత్తుపల్లి టీడీపీ ఎమ్మెల్యే టీఆర్ఎస్ లో చేరడంతో జిల్లాలో టీఆర్ఎస్ బలం ఏడుకు చేరింది. దీంతో ఇక మున్సిపల్ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులు లేరన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల్లో బీజేపీ ప్రభావం చూపక పోయినప్పటికీ.. బలపడేందుకు ప్రయత్నాలు వేగిరం చేసింది. లోక్‌సభ ఎన్నికల తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి సుధాకరరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. భద్రాద్రి జిల్లాలో టీడీపీ నేత కోనేరు సత్యనారాయణ కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. జిల్లాలో మరికొందరు కూడా పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు పలుసార్లు పర్యటనలు సాగించారు. నేతలు ఆశించిన రీతిలో ఆ పార్టీ బలం పుంజుకోలేకపోయింది. దీంతో వచ్చే మున్సిపల్ ఉన్నికల్లో అయినా సత్తా చాటాలని చూస్తున్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అపజయాలు ఆ పార్టీని కొంత కుంగదీశాయి. టీడీపీ నుంచి టీఆర్ఎన్‌లోకి వలసలు మరోసారి కొనసాగడంతో పార్టీ మరింత దెబ్బతిన్నది. కమ్యూనిస్టులు పార్టీ కార్యక్రమాలు చురుగ్గా చేవట్టినా.. అనుకున్న విధంగా రాణించలేకపోయాయి. బీజేపీ భవిష్యత్‌పై ఆశలు పెంచుకుంటూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీ ఎన్నికల నుంచి మండల, జిల్లాపరిషత్, లోక్‌సభ ఎన్నికల వరకు టీఆర్ఎస్ వరుస విజయాలు సాధించింది. దీంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు సునాయాసమేనని ధీమాలో ఉన్నారు. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, మూడున సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ కాంగ్రెస్‌కు రాజీనామాచేసి టీఆర్ఎస్‌లో చేరారు. టీడీపీకి సీనియర్ నేతగా ఉన్న నామ నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య టీడీపీకి రాజీనామా చేసి టీఆర్ఎస్ కండువా కప్పు కున్నారు. ఆ తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం టీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వర రావు, మహబూబాబాద్ గులాబీ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత ఘన విజయం సాధించారు. నామా నాగేశ్వరరావు టీఆర్ఎస్ లోక్‌సభ నేతగా ఎన్నికయ్యారు. అనంతరం జూన్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ఖమ్మంలో 17 జడ్పీటీసీలు, 168 ఎంపీటీసీలు గెలుచుకున్న టీఆర్ఎస్.. జిల్లాపరిషత్ చైర్మన్ పదవిని దక్కించుకుంది. లింగాల కమల్‌రాజ్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా మరికంటి ధనలక్ష్మి ఎన్నికయ్యారు. ఇక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16 జడ్పీటీసీలు, 118 ఎంపీటీసీలను టీఆర్ఎస్ గెలుచుకుంది. అక్కడ కూడా జిల్లాపరిషత్ చైర్మన్ సీటు సాధించింది. చైర్మన్‌గా కోరం కనకయ్య, వైస్ చైర్మన్‌గా కంచర్ల చంద్రశేఖరరావు ఎన్నికయ్యారు. రెండుజిల్లాల్లోనూ మెజారిటీ ఎంపీపీలను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో ఆరు సీట్లను దక్కించుకున్నప్పటికీ.. అందులో నలుగురు ఎమ్మెల్యేలు గులాబీ గూటికి చేరారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ, పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల్లోనూ పార్టీ డీలా పడింది. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్కకు శాసనసభా ప్రతిపక్ష హోదా దక్కినప్పటికీ.. కొన్నిరోజులకే చేజారిపోయింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి ఒకరి తర్వాత ఒకరుగా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఒత్తంగా కాంగ్రెస్ డీలాపడ్డా మున్సిపల్ ఎ÷-న్నికల్లో తమ సత్తా కూడా చాటుతామని అంటున్నారు. వామపక్షాల విషయానికి వస్తే.. సీపీఎం, సీపీఐ, ఎన్డీ ప్రజాపోరాటాల్లో ముందున్నా.. ఎన్నికల్లో వెనుకబడ్డాయి. ఆర్టీసీ సమ్మెతోపాటు రైతు సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా అనేకపోరాటాలు నిర్వహించాయి. కానీ.. ఎన్నికల్లో సరైన విజయాలు సాధించలేదు. ఈ దశలో టీఆర్ఎస్‌కు తిరుగులేదన్న భావన జిల్లాలో ఏర్పడింది.

# నవీపేట్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, డిసెంబర్ 28: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి చింతకుంట నారాయణరెడ్డి నిన్న జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ రోజు తన పర్యటనలో భాగంగా నవీపేట ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. దవాఖానలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల బంధువులను, రోగులను పలకరించారు. ఒక్కో డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బంది వారు చేస్తున్న పని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి హాజరు పట్టికను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. విధులకు హాజరుకాని ఇద్దరు డాక్టర్లు, ఎంపీడీవో, తహసీల్దార్ లకు మెమోలు జారీ చేశారు. అనంతరం నవీపేట ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల మరుగు దొడ్లను పరిశీలించిన కలెక్టర్ వాటిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన వారికి ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి ఫలితాల్లో 100శాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల సమస్యలపై నివేదిక రూపొందించి తనకు అందజేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. పాఠశాల ఆవరణలో చెట్లు పెంచాలని, ఒక్కో విద్యార్థి ఒక్కో చెట్టును పెంచాలని పిల్లలను కోరారు.

### ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై..

# ఎలాంటి విచారణకైనా సిద్ధం

### – నెగెటివ్ ఆటమ్స్‌తో పుట్టిన దుర్మార్గపు వ్యక్తి చంద్రబాబు
### – వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

విశాఖపట్టణం, డిసెంబర్28(ఆర్ఎన్ఎ) : ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై ఎలాంటి విచారణకైనా సిద్ధమని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాటాడారు.. విశాఖలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ టీడీపీ చేస్తున్న ఆరోపణలను విజయసాయిరెడ్డి ఖండించారు. మేం ఎలాంటి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడలే దన్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై ఎలాంటి విచారణకైనా సిద్ధమన్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సీబీఐ కాదు.. ఎఫ్‌బిఐ విచారణకైనా సిద్ధమన్నారు. చంద్రబాబు కుటిల మనస్తత్వమంటూ విమర్శలు గుప్పించారు. తన కుటుంబం మాత్రమే బాగుండాలనుకునే వ్యక్తి చంద్రబాబు అంటూ ధ్వజమెత్తారు. మొత్తం నెగెటివ్ ఆటమ్స్‌తో పుట్టిన దుర్మార్గపు వ్యక్తి చంద్రబాబు ఘాటుగా విమర్శించారు. కుటిల పథకాలు, స్వార్థపూరిత రాజకీయాలు, ఇన్ సైడర్ ట్రేడింగ్.. చంద్రబాబు వల్లనే అవుతాయని, మరెవరి వల్ల సాధ్యం కాదన్నారు. అమరావతిలో విపరీతంగా భూములు కొని, ధనార్జనే ధ్యేయంగా చంద్రబాబు భావించారని అన్నారు. అమరావతిలో బాబు అండ్ గ్యాంగ్ కమీషన్ వ్యాపారం చేసిందని ఆరోపించారు. టీడీపీ అమరావతిలో ఫండింగ్ ఉద్యమాలు నడుపుతోందని విమర్శించారు. అమరావతి మాత్రమే అభివృద్ధి అవ్వాలను కోవడం తప్పన్నారు. విశాఖలో ఏ ఒక్కరు కూడా ఇన్ సైడర్ ట్రేడింగ్ కు పాల్పడలేదన్నారు. ఏపీ అభివృద్ధి కోసం జగన్ ఓ విజన్‌తో ముందుకెళ్తున్నారని తెలిపారు.

రాత్రికిరాత్రే కలొచ్చి 4వేల ఎకరాలు కొన్నారా? – ట్విటర్‌లో విజయసాయి

శనివారం ఉదయం ట్విట్టర్‌లో విజయసాయి చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. నిన్నటి చంద్రబాబు నాయుడు ప్రెస్ కాన్ఫరెన్సు సంతాప సమావేశంలా ఉందని విజయసాయి విమర్శించారు. మీరు అంత నిప్పు, పత్తిగింజ అయితే ఇన్ సైడర్ ట్రేడింగ్ జరగనే లేదు.. మా అందరికీ ఒకేసారి కల వచ్చి 4వేల ఎకరాల భూములు కొనుగోలు చేశామని చెప్పండంటూ సెటైర్లు వేశారు. దీనిపై దర్యాప్తు చేసి మాపై పడిన నింద తొలగించమని సీబీఐని కోరండన్నారు. ఏం లేకపోతే మీకెందుకు భయమని విజయసాయి ప్రశ్నించారు. ఇన్ సైడర్ ట్రేడింగ్ జరగకపోతే టీడీపీ నాయకులు, చంద్రబాబు వర్గం రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాలుగు వేల ఎకరాల భూమిని కూడబలుక్కున్నట్టు ఎలా కొంటారు? 2014 జూన్ లో బాబు సిఎం అయ్యారు. డిసెంబర్ లో అమరావతిని క్యాపిటల్ గా ప్రకటించే లోపే ఐదు నెలల్లో ఎగబడి కొన్నారంటే తెలియడం లేదా అని సూటిగా ప్రశ్నించారు. రాజధాని కోసం చంద్రబాబు మార్కెటింగ్ మేనేజర్ అవతారం ఎందుకెత్తారో ఢిల్లీ మీడియా వర్గాలకు అప్పట్లో అంతుబట్టలేదని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమని ఇప్పుడర్థమైందన్నారు. ప్రజా ధనంతో దేశాలు తిరిగి అమరావతిపై ప్రెజెంటేషన్లు ఇచ్చాదని, పెట్టుబడుల కోసమైతే వెనకబడిన జిల్లాల గురించి ప్రస్తావించొచ్చు కదా.. అని విజయసాయిరెడ్డి విమర్శించారు.

# బీజేపీ ఎక్కడికి వెళ్తే.. అక్కడ ద్వేషాన్ని వ్యాప్తి చేస్తోంది

హైదరాబాద్, డిసెంబర్ 28: బీజేపీ ఎక్కడికి వెళ్తే.. అక్కడ ఆ పార్టీ ద్వేషాన్ని వ్యాపి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఇవాళ ఆయన అస్సాంలోని గౌహతిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీఏఏ, ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా అస్సాంలోనూ, దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయన్నారు. మీరెందుకు ఆందోళనకారుల్ని కాల్చి చంపుతున్నారని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల గొంతును బీజేపీ వినడం లేదన్నారు. అస్సామీ భాష, సంస్కృతిపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడిని అడ్డుకోవాలన్నారు. అస్సాంను నాగపూర్ నడిపించదన్నారు. అస్సాంను చడ్డీ వేసుకునే ఆర్ఎస్ఎస్ వాళ్లు ఏలరన్నారు. అస్సాంను అస్సామీలే పాలిస్తారని రాహుల్ తెలిపారు.




# ట్రిపుల్ తలాక్ బాధిత మహిళలకు ఆర్థికసాయం

హైదరాబాద్, డిసెంబర్ 28: : ట్రిపుల్ తలాక్ బాధిత మహిళలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. బాధిత మహిళలకు వార్షికంగా ఆరు వేలు ఇవ్వనున్నట్లు సీఎం యోగి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే వారికి ఉచిత న్యాయ సాయం చేస్తుందన్నారు. భర్తల నుంచి వేరుపడిన లేదా భర్తలు వదిలేసిన .. మహిళలందరికీ ఆర్థిక సాయాన్ని అందివ్వనున్నట్లు సీఎం యోగి తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. అయితే ట్రిపుల్ తలాక్ బాధితులు ఆర్థిక సాయం కోసం ఎఫ్ఐఆర్ కాపీని సమర్పించాల్సి ఉంటుంది. సుమారు 5వేల మంది ట్రిపుల్ తలాక్ బాధిత మహిళలు యూపీలో ఈ స్కీమ్ కింద లబ్ధిపొందనున్నారు.

## రెండో విడత ప్రణాళికకు రంగం సిద్ధం

### అధికారులకు దిశానిర్దేశం

భూపాలపల్లి,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): రెండో విడుత పల్లె ప్రగతికి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు చెప్పారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించామని, అందరి సహకారంతో కార్యక్రమాలను విజయవంతం చేస్తామన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చారు. రెండో విడత ప్లలె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చేపట్టే రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమంపై ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడత 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక విజయవంతం చేసినట్లు రెండో విడుత కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. గ్రామాల్లో మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధికారులు, మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సర్పంచులు, కార్యదర్శులు గ్రామాలను పరిశీలించి, చేపట్టాల్సిన పనులను గుర్తించాలని, రెండో విడత పల్లె ప్రగతిని చాలెంజ్‌గా తీసుకోని, అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే సర్పంచులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా ఇస్తున్న నిధులతో పాటు ఉపాధి హామీ నిధులను వాడుకోవాలని, గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలని కోరారు. పచ్చదనం-పరిశుభ్రత, విద్యుత్ సమస్యలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డుల ఏర్పాటు, పాడుబడిన బావుల పూడ్చివేత తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

### పూర్వికుల గురించి తెలుస్తుందనే..

## అసదుద్దీన్ ఓవైసీకి భయం

### – ఎన్ఆర్సీపై ఇటాలియన్ మాఫియా రాజకీయం చేస్తోంది
### – సీఏఏ వల్ల భారతీయ ముస్లింలకు ఎలాంటి ఇబ్బందిఉండదు
### – మైనార్టీలు ఓవైసీ మాయలో పడొద్దు
### – బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్

నిజామాబాద్, డిసెంబర్28 (ఆర్ఎన్ఎ) : ఎన్ఆర్సీ, ఎన్‌సీపీ, సీఏఏలపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ ఎందుకు భయపడుతున్నాడో అర్థం కావటం లేదని, ఆయన పూర్వికుల గురించి ప్రజలకు తెలుస్తుందనే భయం ఆయనలో పట్టుకున్నట్లు కనిపిస్తుందని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శలు గుప్పించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఎన్ఆర్సీ రాజ్యాంగ విరుద్ధం అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యాలను అరవింద్ తీవ్రస్థాయిలో తప్పబట్టారు. తన పూర్వికుల గురించి వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే అసదుద్దీన్ ఓవైసీ ఎన్ఆర్సీని వ్యతిరేకిస్తున్నారని అరవింద్ అన్నారు. ఓవైసీ తన స్వార్థ రాజకీయం కోసం ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. సీఏఏ వల్ల భారతీయ ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఓవైసీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. ఎన్ఆర్సీపై ఇటాలియన్ మాఫియా రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎంత వ్యతిరేకించినా.. సీఏఏ, ఎన్ఆర్సీల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గదని అరవింద్ తేల్చిచెప్పారు.

మున్సిపల్ ఎన్నికల దృష్ట్యానే ఓవైసీ సభ పెట్టారన్నారు. జనగణమన పాడని ఓవైసీ.. సెక్యులరిజం గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో ముస్లిం మైనారిటీ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని మండిపడ్డారు. మైనారిటీ ఏరియాలో తన పర్యటన వద్దని పోలీసులు చెబుతున్నారని..

ఈ దేశం ఎటు పోతోందని ప్రశ్నించారు. ఎంపీకే రక్షణ ఇవ్వలేకపోతే సీఎం కేసీఆర్ ఏం చేస్తున్నట్లు అని మండిపడ్డారు. ఎన్ఆర్సీ పై కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని నిప్పులు చెరిగారు. అభివృద్ధిని చూసి మైనారిటీలు ఓటు వేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్,ఎంఐఎం లకు ప్రజలు బుద్ధి చెబుతారని అరవింద్ పేర్కొన్నారు. టీఆర్ఎన్ ప్రభుత్వాన్ని ఎంఐఎం నడిపిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ కు అసదుద్దీన్ పెద్ద కొడుకులా మారారని విమర్శించారు. మైనార్టీలు ఓవైసీలో మాయలో పడొద్దని కోరారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అరవింద్ కోరారు

# రెండోవిడత పల్లెప్రగతికి సన్నాహాలు

### అధికారులు సన్నద్ధంగాఉండేలా చర్యలు

జనగామ,డిసెంబర్28(ఆర్ఎన్ఎ): వచ్చె నెలలో ప్రారంభం కానున్న రెండో విడత పల్లెప్రగతి కార్యక్రమంలో ప్రంచాయతీ కార్యదర్శులు స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీవో రాంరెడ్డి అన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గతంలో నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేశారని, అదే విధంగా ప్రజల్లో ఇప్పటికే 30 రోజుల ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాల పట్ల ఒక అవగాహన ఏర్పడటంతో రెండో విడత కార్యక్రమంలో వారిని భాగస్వాములను చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందించే వారిని గుర్తించి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. నర్సరీల్లో పెంచే మొక్కలను ఆయా పంచాయతీ కార్యదర్శులు ఎటువంటి మొక్కలు కావాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నర్సరీ రక్షణకు వనసేవకుని పాత్ర కీలకమని, అవగాహన ఆసక్తి కలిగిన వారిని గుర్తించి వనసేవకులుగా నియమించుకోవాలని సూచించారు. ఇకపోతే ఉపాధిహామీ ద్వారా చేపట్టే పనులు పారదర్శకంగా నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడొద్దని హెచ్చరించారు. పలు గ్రామాల్లో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల బిల్లులు ఉపాధిహామీ కూలీలు లబ్దిదారులకు అందలేదని, కూలీలకు సరిగా పనులు కల్పించడంలేదని డీఆర్పీలు తమ నివేదికల ద్వారా వెల్లడించారు. కూలీలు చేసిన పనుల కన్న అదనంగా పనులు చేసినట్లు రికార్డు చేసినట్లు వెల్లడించారు. రిజిస్టర్లు సరిగా రాయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు ఫీల్డు అసిసెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

### రెండు మున్సిపాలిటీల్లో అధికారులకు ఆదేశాలు

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్28 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని రెండు మున్సిపాలిటీలైన కొత్తగూడెం, ఇల్లెందులో ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపట్టామని కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ వివరించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన అంశాలను కలెక్టర్ వివరించారు. అధికారులకు సలహాలు, సూచనలు చేశామని అన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీలకు రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. కొత్తగూడేనికి 16, ఇల్లెందుకు 16మందిని, సహాయ రిటర్నింగ్ అధికారులను రెండు మున్సిపాలిటీలకు 11మంది చొప్పున నియమించామని, మొదటి ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేశామని వివరించారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలను, ఇల్లెందులో సింగరేణి కమ్యూనిటీ హాళ్లను ఎంపిక చేశామన్నారు. పోలీస్‌శాఖ సహకారంతో సమస్యాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా చూడాలని ఆదేశించారు.

# పసుపు రైతుల పాదయాత్ర ప్రారంభం



నిజామాబాద్, డిసెంబర్ 28: పసుపుకు మద్దతు ధర, పసుపు పంటకు ప్రత్యేక బోర్డు ఏర్పాటును డిమాండ్ చేస్తూ పసుపు రైతులు రెండో దశ పాదయాత్ర ప్రారంభించారు. పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు పాదయాత్ర ఉధృతంగా కొనసాగుతోంది. జిల్లాలోని నందిపేట మండలం బాద్గుణ గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు . ఎంపీ అరవింద్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని, పసుపు బోర్డు ఏర్పాటు చేయకుంటే ఎంపీ పదవికి రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మొదటి దశ పాదయాత్ర జిల్లాలోని వెల్గటూర్ నుంచి ప్రారంభమై వెంచిర్యాలలో ముగిసింది. రెండు మండలాలు 40 గ్రామాలను చుడుతూ ఈ పాదయాత్ర కొనసాగింది. పసుపు బోర్డు మినహా ఇతర ఏ హామీని తాను అంగీకరించేది లేదని రైతులు తేల్చి చెప్పారు.

### ఈ చదువులతో..

# ప్రపంచంతో ఎలా పోటీపడతారు?

### – ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసిన మంత్రి హరీశ్‌రావు




సంగారెడ్డి జిల్లా కందిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్థిక మంత్రి హరీష్ రావు

సంగారెడ్డి, డిసెంబర్28(నేటినిజం ప్రతినిధి) : ఈ చదువులతో ప్రపంచంతో ఎలా పోటీపడతారు.. అసలు వీళ్లు చదువు చెబుతున్నారా..? లేక వీళ్లే చదవటం లేదా..?.. ఇలా అయితే కనీసం పాస్‌కూడా కారుకదా.. మీరేం చేస్తున్నారు అంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులపై ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం మంత్రి సంగారెడ్డి జిల్లా కందిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మంత్రి.. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా సబ్జెక్టులలో విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. పలువురు విద్యార్థులను పిలిచి బోర్డుపై తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో పేర్లు రాయాలని సూచించారు. దీంతో పలువురు విద్యార్థులు తెలుగులో సరిగా పేర్లు కూడా రాయలేకపోవడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువు ఇలా ఉంటే ఎలా పాసవుతారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. విద్యార్థులు ఎక్కాలు చెప్పలేకపోవడంతో ఈచదువులతో ప్రపంచంతో ఎలా పోటీపడతారని ప్రశ్నించారు. టీవీలు, సెల్ ఫోన్లు పక్కన పెట్టాలని, పదో తరగతి ఫలితాలలో కంది పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మంత్రి సూచించారు. పాఠశాల సమస్యలపై నివేదిక రూపొందించి తనకు అందజేయాలని ప్రధానోపాధ్యాయుడికి ఆదేశించారు. అనంతరం కందిలో నిర్మిస్తున్న టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.